నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 17-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:132 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

నిండు మనముతో నాడుచు
"అండరు నైన్టీను క్రికెటు" నద్భుత గతిలో
పండించుచు యువకులు పూ
దండలు గొనినారు భారతము మెచ్చంగన్ !!

(అండర్ నైన్టీన్ క్రికెట్లో మన వారు అద్భుతమైన ప్రతిభ కనబరిచి అమెరికా పై విజయం సాధించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210

మరక

పురపాలక ఎన్నికల్లో
పార్టీల సంరంభం
విమర్శలే ఆయుధంగా
వింత ఆట ప్రారంభం.
కడుహీనం తిట్లకింకా
కనిపించవు నిరోధాలు
ప్రజాతీర్పు మారగలదా
పెంచుకుంటే విరోధాలు.

-వేల్పుల నారాయణ
9440433475

రెండో విడత సీఎం కప్‌కు రంగం సిద్ధం

- ఉత్సాహంగా కొనసాగిన క్రీడాజ్యోతి ర్యాలీలు
-మొట్ట మొదటి సారిగా అసెంబ్లీ స్థాయిలో
-నేటి నుంచిప్రారంభం కానున్న గ్రామీణ పోటీలు

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ ప్రభుత్వం క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న రెండో విడత సీఎం కప్ 2025 కు ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తి అయ్యాయి . ఈరోజు నుండి (జనవరి 17) గ్రామీణ సాయి పోటీలు ప్రారంభం కానున్నాయి 5 అంచలుగా గ్రామీణ, మండల అసెంబ్లీ నియోజకవర్గ జిల్లా రాష్ట్రస్థాయిలో ఈ పోటీలు జరగనున్నాయి. మొదటిసారిగా అసెంబ్లీ స్థాయిలో జనవరి 17 నుండి 23 వరకు గ్రామస్థాయి పోటీలు నిర్వహించనున్నారు అందులోని విజేతలను మండల స్థాయికి మండల స్థాయిలో విజేతలైన వారిని నియోజకవర్గ స్థాయికి ఆ తదుపరి జిల్లా స్థాయికి జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఈసారి అసెంబ్లీ నియోజక వర్గస్థాయిలో పోటీ నిర్వహించడం విశేషం.

జనవరి 17 నుండి ఫిబ్రవరి 23 వరకు

కథ సీఎం కప్ 20 24 పోటీలు నాలుగు అంచల్లో గ్రామీణ మండల జిల్లా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా దాదాపు 3 లక్షల మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈసారిఅసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో కూడా పోటీలు నిర్వహిస్తుండడంతో 5 అంచెలుగా ఈ పోటీలు కొనసాగనున్నాయి.

గ్రామపంచాయతీ స్థాయిలో 17 జనవరి నుండి 22 జనవరి వరకు,

మండల మరియు మున్సిపాలిటీ పరిధిలో 28 జనవరి నుండి 31 జనవరి వరకు, అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో 3 నుండి 5 ఫిబ్రవరి వరకు, జిల్లా స్థాయి పోటీలు 9 ఫిబ్రవరి నుండి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 20 నుండి 23 వరకు నిర్వహించాలని స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేస్తోంది.

ఉత్సాహవంతంగా క్రీడాజ్యోతి ర్యాలీలు

యువ క్రీడాకారుల్లో అవగాహన కల్పించేందుకు క్రీడా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్నిమండల కేంద్రాల్లో క్రీడా జ్యోతి ర్యాలీలు నిర్వహిం చారు. యువ క్రీడాకారులు ఉత్సాహవంతంగా ఈ ర్యాలీలలో పాల్గొన్నారు దాదాపు రెండు లక్షల మంది క్రీడాకారులు ఇప్పటికే ఆన్ లైన్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

పల్లె ప్రతిభను గుర్తించడానికే

పల్లెల నుండి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలని 2036 ఒలంపిక్ క్రీడల్లో తెలంగాణ ప్రాతినిధ్యం ఉన్నతంగా ఉండాలన్న లక్ష్యంతో క్రీడలకు పెద్దపీట వేస్తూ గ్రామీణ క్రీడాకారులను గుర్తించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు

మట్టిలో మాణిక్యాలను గుర్తించే లక్ష్యంతో గత సంవత్సరం నిర్వహించిన సీఎం కప్ విజయవంతమైందని అదే స్ఫూర్తితో రెండో విడత సీఎం కప్ 20 25 నిర్వహిస్తున్నామని ఇందులో గ్రామీణ క్రీడాకారులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం సమన్వయం ఉంటుందని పిఈటిలు ఫిజికల్ డైరెక్టర్లు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. సెకండ్ ఎడిషన్ సీఎం కప్ 2025 సాంకేతిక సహకారంతో గ్రామీణ క్రీడాకారులకు సంపూర్ణ సమాచారం అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తెలిపారు. ఏఐ కాల్ సెంటర్,వాట్సాప్ బట్, వెబ్సైట్, ఏఐ చాట్ బాట్ తో సమగ్ర సమాచారం గ్రామీణ క్రీడాకారులకు అధికారులకు అందే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారుల సమాచారం సేకరించి వారి వివరాలను కంప్యూటీకరించి వారి సమగ్ర సమాచారం భద్రపరచడానికి స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లు చేసింది

ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం..

-స్పీకర్‌కు ఇదే చివరి అవకాశం.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా

న్యూ డిల్లీ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఎమ్మెల్యేల అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.ఫిరాయింపు ఎమ్మెల్యే లపై విచారణ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తరఫున అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం ప్రకటించారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ కంటి ఆపరేషన్ చేయించుకున్నారని.. అలాగే సెక్రటరీ జనరల్ మారాంని తెలిపారు. దీనివల్ల జాప్యం జరుగుతోందని.. మిగిలిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని తెలిపింది. స్పీకర్‌కు చివరి అవకాశం ఇస్తున్నామని.. రెండు వారాల్లో మిగతా ఎమ్మెల్యేలపై కూడా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలని సూచించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఆదిలాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ వరాల జల్లు

ఆదిలాబాద్, జనవరి 16: ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా - కొరాట బ్యారేజ్ పంప్ హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగిం చారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు.

సరైన న్యాయం జరగలేదు..

పోరాటం, పౌరుషాల గడ్డ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సరైన న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధి చేస్తామని వివరించారు. ఆదిలాబాద్‌కు కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక - కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధికి నిధులు ఇస్తామని స్పష్టం చేశారు ముఖ్యమంత్రి.

నిధులు మంజూరు చేశాం..

చనాక - కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

ఆదిలాబాద్ యూనివర్సిటీని తానే ప్రారంభిస్తానని రేవంత్ చెప్పుకొచ్చారు. కాళేశ్వరానికి రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చు చేసినా.. చుక్కనీరు రాలేదని విమర్శించారు. రైతులకు నీరు రావాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. నాగోబా జాతరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రూ.300 కోట్లతో మేడారం ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు సీఎం రేవంత్.

అందుకే మోదీని కలుస్తున్నా..

'ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభిస్తాం. ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధికి 10వేల ఎకరాల భూసేకరణ జరుపుతాం. పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధికి కలిసి పనిచేద్దాం. అందుకే ప్రతి మూడు నెలల కోసారి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుస్తున్నాం. బీజేపీ ప్రజాప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువస్తే పరిష్కరిస్తాం. నేను తరచూ ప్రధానిని కలవడంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నాకు నరేంద్ర మోదీతో బంధుత్వం లేదు.. చుట్టమూ కాదు. ఆయన మనకు ప్రధాని.. ఆయనతో పనులు చేయించుకుంటున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా, పైరవీల కోసం పోవడం లేదు, పర్సనల్ ఎజెండా ఏమీ లేదు. ఎవరిని కలిసినా అభివృద్ధి కోసమే. కేంద్రం సహకారంతోనే అవసరమైన ఎయిర్ పోర్టులు, నిధులు వస్తున్నాయి. నాటి పాలకులు చేసిన అప్పులే ఇప్పుడు ఉరితాడు అయ్యాయి. మేం ఫ్యూచర్ సిటీ అంటే మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ అంటున్నారు' అని ప్రతిపక్షాలనుద్దేశించి అన్నారు ముఖ్యమంత్రి.

ఫామ్‌హౌస్‌లోనే ఉండండి..

'పదేళ్ల పాలనలో ఏమీచేయని వ్యక్తి ప్రజాపాలనను భరించలేక పోతున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి.. లేకుంటే ఫామ్‌హౌస్‌లోనే ఉండండి. మారీచుడు, సుగ్రీవుడు తరహాలో రాక్షసుల్లా.. అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉన్న వ్యక్తి ప్రోత్సహిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. బీఆర్ఎస్ నేతలకు అభివృద్ధి అంటే ఇష్టం లేకపోతే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మొన్న పంచాయతీ ఎన్నికల్లో 66శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ మంచి వాళ్లను ఎన్నుకోండి. సమస్యలను పరిష్కరించే వాళ్లను, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసిన వాళ్లనే గెలిపించుకోండి. నేను ఓడిపోయిన వాళ్ల గురించి మాట్లాడను. మేం పాలకులం కాదు.. సేవకులం. మీ మనసు గెలుస్తాం.. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం. 2038వరకు అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 16:రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో ఓఖ ద్వారా కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఓఖ కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరిం చారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన.

మధ్యవర్తులకు పంటను అమ్మొద్దు..

వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకురావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

- తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్

తుంగతుర్తి, జనవరి 16 : రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం అరైవ్ ఎలైవ్ రోడ్డు భద్రత మహా ఉద్యమ అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తుంగతుర్తి మండల కేంద్రంలోని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చు అని తెలిపారు.

ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదని, ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వ్యక్తిగత జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే వారి కుటుంబం రోడ్డున పడుతుందని కావునా అంతా జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, కానిస్టేబుళ్లు, స్టాఫ్ నర్సులు, మొగలగాని వంశీ, పక్కినపల్లి నరేశ్, భాషబోయిన వెంకన్న పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్లను, నగర మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకోవాలి

-స్థానిక ప్రభుత్వాలపై చిన్న చూపు తగదు.
-ఎన్నికల అనంతరం జరిగే పదవుల బేర సారాలకు స్వస్తి పలకండి
-పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఈనాటికి కూడా స్పందన లేకపోవడం విడ్డూరం.
-లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు -తుమ్మనపల్లి శ్రీనివాసు డిమాండ్.

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల పదవీ కాలం ఈ నెల చివరి వారంతో పదవీ కాలం పూర్తయి సుమారు రెండు సంవత్సరాలు కావొస్తుందని ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే నగరానికి మేయర్ ను, మున్సిపల్ పట్టణాలకు చైర్మన్ లను ప్రజలే ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే ఎన్నుకొనేల చర్యలు తీసుకోవాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. గతంలో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని బహిరంగ లేఖ ద్వారా ఈ-మెయిల్ ద్వారా ముఖ్యమంత్రిని కోరామని అయినా ఈనాటి వరకు ప్రభుత్వం స్పందిచక పోవడం స్థానిక ప్రభుత్వాల పట్ల నిర్లక్ష ధోరణి స్పష్టమైందని ఆయన అన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానం కొత్తదేమి కాదని గతంలో మూడు సార్లు 1987 -1992, 1992 - 1997 మరియు 1997 - 2002 వరకు మున్సిపల్ చైర్మన్ పదవికి గ్రామ సర్పంచ్ మాదిరిగా పట్టణ ప్రజలు ప్రత్యక్షంగా చైర్మన్ ని ఎన్నుకొనే వారని అదే విధంగా నగర మేయర్ ని ప్రత్యక్షంగా నగర ప్రజలు ఎన్నుకొనేవారని అయితే గత ప్రభుత్వాల కుట్ర, స్వార్థ, ధన రాజకీయాల మూలంగా అధికార క్రీడల నేపథ్యంలో చైర్మన్ పదవులు వేలం పాటలకు దారితీశాయని స్థానిక ప్రభుత్వాల మనుగడ ప్రశ్నార్థకం అయ్యిందని ఇక ఎంత మాత్రం రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాల్సిన అవసరం లేదని త్వరలో జరిగే ఎన్నికలలో మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్లను, నగర కార్పొరేషన్ మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకొనేలా చర్యలు తీసుకోవాలని తుమ్మనపల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు గతంలో బహిరంగ లేఖ ద్వారా సైతం ముఖ్యమంత్రిని కోరామని ఈనాటి వరకు కూడా ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డురంగా ఉందని ఆయన అన్నారు.

47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా టికెట్ కోసం ఉల్లెంగ నాగరాజు దరఖాస్తు

నిజామాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఉల్లెంగ నాగరాజు 47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మన నిజామాబాద్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఐన నాగరాజు బొబ్బిలి వీధి ఎల్లమ్మ గుట్ట మాజీ యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ గా పనిచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పి.ప్రదీప్ , కిరణ్ తదితరులు ఆయనకు మద్దర్టు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన నిజామాబాద్ నాయకులకు, ప్రజలకు, 47 డివిజన్ ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

భక్త జనంతో పోటెత్తిన ఐనవోలు.. మార్మోగిన శివసత్తుల పూనకాలు

హన్మకొండ, జనవరి 16:ఐలోని మల్లన్న దండాలో.. మమ్మేలు మస్వామి సల్లంగ సూడు దండాలో అంటూ సంక్రాంతి పర్వదినం రోజున ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయం శివమెత్తింది. తెలంగాణ జానపదుల జాతరగా పేరుగాంచిన ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బోగి, సంక్రాంతి పర్వదినాల్లో లక్షల్లో భక్తులు హాజరయ్యారు. ఆలయా ఆవరణంలో స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు సంక్రాంతి పర్వదినం రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవాలయంలో బోనాలు, చేసి శివసత్తుల పూనకాలతో ఎల్లమ్మ దేవతకు, మల్లికార్జునస్వామికి నైవేద్యం సమర్పించారు.

సంక్రాంతి పర్వదినం రోజున అర్చకులు స్వామి వారికి ఉత్తరాయణ, పుణ్యాకాలము, విష్ణేశ్వరపూజ, పుణ్యాహ వాచనము, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు చేసి బిల్వార్చన శివలింగాన్ని అలకంరించారు. మహానివేదన నీరాజన మంత్రపుష్పం తీర్థపు సాద వితరణ మల్లికార్జునస్వామికి బంగారు మిసాలు, వెండి కిరీటం, వెండి కవచం సుగంధా లు వెదజల్లే గజ పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథాన్ని మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కొబ్బరి కొట్టి ప్రారంభించారు. అనంతరం ఒంటిమామిడిపల్లి, ముల్కలగూడెం, పెరుమాండ్లగూడెం గ్రామాలను నుంచి కూడ ప్రభల బండ్ల కట్టి స్వామి వారికి మహానివేదనగా సమర్పించారు.

స్వామిని దర్శించుకున్న ఎంపీ ఈటెల, ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాల పురస్కరించుకొని ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండెటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, టి రాజేశ్వర్రావు, మాజీ ఎంపీ సీతారాంనాయక్ మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందు ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక సర్పంచ్ గడ్డం రఘువంశీ, మండల నాయకులు, ఆలయా అధికారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచులు గడ్డం రఘువంశీ, ఆడెపు స్రవంతి, గుండ్లెటి ఏలియా, కంజర్ల ఆశోక్‌రావు, ఉస్మాన్‌అలీ, మాజీ సొసైటీ చైర్మన్ చందర్ రావు, మాజీ సర్పంచ్ దయాకర్, మాజీ ఎంపీటీసీ రాజు, మాజీ కార్పోరేటర్ యాదగిరి, మాజీ జడ్పీటీసీ బిక్షపతి, గోపాల్ రావు రామ్మూర్తి, కుమార్, అశోక్, రాజు, నాగరాజు, లక్ష్మణ్, కొంరయ్య, దేవదాసు, ఏలియా, సుధాకర్, కుమారస్వామి, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రణయ్, రాజు, రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసాధారణ మేధావి ‘బెంజమిన్ ఫ్రాంక్లిన్’

(17 జనవరి “బెంజమిన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం” సందర్భంగా)

స్వతంత్ర అమెరికా చరిత్రలో అత్యంత బహుముఖ ప్రతిభాశాలి, పేరెన్నికగల అమెరికా సంయుక్త రాష్ట్రాల “వ్యవస్థాపక పితామహుడు”గా బెంజమెన్ ఫ్రాంక్లిన్ ప్రపంచవ్యాప్త ఖ్యాతిని పొందారు. ఒక సాధారణ వ్యక్తి ఎలాంటి పై చదువులు చదవకుండానే అనేక రంగాల్లో తన ప్రతిభను ప్రదర్శించారు. కవి, రచయిత, పబ్లిషర్, ప్రింటర్, రాజకీయ తత్వవేత్త, సామాజిక చైతన్యశీలి, దౌత్యవేత్త, శాస్త్రవేత్త, సంగీత విద్వాంసుడు, మ్యాప్‌మేకర్, ఆవిష్కర్త, రాజకీయవేత్త, పోస్ట్‌మ్యాన్ అయిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ అమెరికా చరిత్రలో చెరగని ముద్ర వేశారు. 1776లో బ్రిటన్ వలసపాలనలో ఉన్న ‘అమెరికా స్వాతంత్ర్య ప్రకటన’ రచనా కమిటీ ఐదుగురిలో ఒక సభ్యుడిగానే కాకుండా మరో నాలుగు ముఖ్యమైన పత్రాలపై సంతకం చేసిన ఘనుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్.

సాధారణ జీవితంతో అసాధారణ సాఫల్యత:

17 జనవరి 1706న ఒక సాధారణ సబ్బులు-కొవ్వత్తులు తయారు చేసే కుటుంబంలో జోసియ్య ఫ్రాంక్లిన్-అభిషా ఫోల్గర్ దంపతులకు పదవ సంతానంగా జన్మించారు. తన 10వ ఏటనే బడికి వెళ్ళడం మానేసి తండ్రికి సహాయకుడిగా సబ్బులు, కొవ్వత్తుల తయారీలో చేయూతను ఇచ్చారు. అలాంటి ఒక అతి చిన్న స్థాయి నుంచి స్వయంకృషితో ఎదిగి అమెరికాలో ఎవరూ సాధించలేని అసాధారణ ఉన్నత స్థాయికి చేరి అందరికీ ఆదర్శంగా నిలిచారు. స్వతంత్ర యూఎస్ ఉనికికి, మనుగడకు గట్టి పునాదులు బెంజమెన్ ఫ్రాంక్లిన్ పుట్టిన రోజు 17 జనవరి నాడు “బెంజమెన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం”గా ప్రతి ఏట నిర్వహించడం సముచితంగా ఉన్నది.

బెంజమెన్ ఫ్రాంక్లిన్ బహుముఖీన ప్రతిభ:

వైజ్ఞానిక శాస్త్ర రంగంలో ‘లైటెనింగ్ రాడ్’, ‘బైఫోకల్ కళ్లఅద్దాలు’, ‘ఫ్రాంక్లిన్ స్టౌవ్’ లాంటి పలు ఉపకరణాలను కనుకొన్నారు. నేటి ఎలక్ట్రానిక్ రంగం మనం నిత్యం వాడుతున్న పదాలు ‘బ్యాటరీ’, ‘చార్జ్’, ‘కండక్టర్’, ‘ఎలక్ట్రిఫై’ లాంటి ప్రధాన పదాలను ప్రవేశ పెట్టిన ఘనత బెంజమెన్ ఫ్రాంక్లిన్‌ది మాత్రమే. ఇవే కాకుండా ‘స్విమ్ ఫిన్స్’, ‘ఫ్లెగ్జిబుల్ కాతెటర్’, ‘గ్లాస్ అర్మోనికా’, ‘లాంగ్ ఆర్మ్’, ‘24-గంటల గడియారం’ లాంటి పలు పరికరాలను ఆవిష్కరించారు. ‘అమెరికన్ ఫిలాసాఫికల్ సొసైటీ’ స్థాపకుడిగా చరిత్రలో నిలిచారు. విద్యారంగంలో ‘లైబ్రరీ కంపెనీ ఆఫ్ ఫిలడెల్ఫియా’తో పాటు ఫిలడెల్ఫియా యూనివర్సిటీ’ స్థాపనకు ప్రేరణగా నిలిచిన ఫ్రాంక్లిన్ సామాజికశాస్త్ర రంగంలో ‘ఫిలడెల్ఫియా ప్రతినిధి’గా సేవలు అందించి, ఫ్రాన్స్‌కు తొలి అమెరికా రాయబారిగా అనుభవం గడించారు. అమెరికా తొలి ‘పోస్ట్‌మ్యాన్ జనరల్’గా, మరణానంతరం తొలి పోస్టల్ స్టాంప్‌పై బెంజమెన్ ఫ్రాంక్లిన్ ఫోటో ముద్రించడం జరిగింది. పలు పుస్తకాల రచయితగా నేటికీ తన రచనలతో మార్గనిర్దేశనం చేస్తున్న బెంజమెన్ ఫ్రాంక్లిన్ నేటి అభివృద్ధి చెందిన అమెరికాకు గట్టి పునాదులు వేశారు. సాంప్రదాయ విద్యాభ్యాసం చేయకుండానే ఒక వ్యక్తి ఇన్ని రంగాల్లో ప్రపంచ ప్రఖ్యాత స్థాయి వ్యక్తిగా ఎదగడం నమ్మశక్యంగా ఉండదు. తన 84వ ఏట 17 ఏప్రిల్ 1790న తుది శ్వాస విడిచిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం ప్రపంచ మానవాళికి, ముఖ్యంగా విశ్వ యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నది. బెంజమెన్ ఫ్రాంక్లిన్ సూచనలతో పలు నగరాలు, విద్యాలయాలు, యూనివర్సిటీలు, దేశాలు, కార్పొరేషన్లకు పేర్లను ఖరారు చేయడం జరిగింది. స్వతంత అమెరికా వ్యవస్థాపక పితామహుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం మనందరికీ దారి దీపం కావాలని కోరుకుందాం, వారి జీవితం నుంచి ప్రేరణను పొందుదాం.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి “ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్” పై నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం

న్యూఢిల్లీ, జనవరి 16: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం సంయుక్తంగా చేపట్టిన ‘ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్- నయే భారత్ కి నంయా పెహచాన్’ అనే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నేడు విజయవంతంగా ముగిసింది. నెట్‌ఫ్లిక్స్ సహకారంతో గ్రాఫిటీ స్టూడియోస్ భాగస్వామ్యంతో అమలు చేసిన ఈ కార్యక్రమం.. దేశంలోని ఆవిష్కరణ రంగం, సృజనాత్మక రంగాలను ఒకే వేదికపైకి చేర్చింది. సామాజిక ప్రాధాన్యత గల ఆవిష్కరణలను కథలు చెప్పడం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం, విద్యార్థులకు క్షేత్రస్థాయిలో నైపుణ్య శిక్షణ ఇవ్వడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశ్యం.

సామాజిక ప్రభావాన్ని సృష్టించే ఆవిష్కరణలకు కృషి చేసినందుకు ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం గుర్తించిన ఎనిమిది భారతీయ అంకుర సంస్థల సహకారాన్ని ఈ కార్యక్రమం ప్రదర్శిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, చిత్కారా యూనివర్సిటీ, సత్యజిత్ రే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ తదితర ఎనిమిది విశ్వవిద్యాలయాల విద్యార్థులు రూపొందించిన ఎనిమిది లఘు యానిమేటెడ్ చిత్రాల ద్వారా ఈ స్టార్టప్‌లను పరిచయం చేశారు. నెట్‌ఫ్లిక్స్, జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థతో (ఎన్ఎఫ్‌డీసీ) కలిసి నిర్వహిస్తున్న ‘వాయిస్ బాక్స్’ అనే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ చిత్రాలకు సంబంధించిన వాయి స్ ఓవర్‌ను రికార్డ్ చేశారు.

నెట్‌ఫ్లిక్స్ ఫండ్ ఫర్ క్రియేటివ్ ఈక్విటీ ఆధ్వర్యంలో కథనశైల, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా రూపొందించిన ఈ కార్యక్రమం.. దేశంలోని విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన 26 మంది విద్యార్థులకు ప్రత్యక్ష సృజనాత్మక అనుభవాన్ని అందించింది. ఇందులో పాల్గొన్న వారిలో 50 శాతం మంది మహిళలు కాగా, పలువురు విద్యార్థులు వివిధ నగరాల నుంచి వచ్చారు. విద్యార్థులకు అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ), గ్రాఫిటీ స్టూడియోస్‌కు చెందిన నిపుణులు మార్గదర్శ కత్వం వహించారు. దీని ద్వారా వారు పరిశ్రమలో అనుసరించే ప్రక్రియలను ప్రత్యక్షంగా, వాస్తవ అనుభవంతో తెలుసుకునే అవకాశం పొందారు.

ఈ కార్యక్రమానికి రూపొందించిన అసలు గీతాన్ని శంకర్ మహదేవన్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఆలపించగా.. అది ఈ కార్యక్రమానికి సాంస్కృతిక, సృజనాత్మక కోణాన్ని మరింత పెంచింది.

ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ మాట్లాడుతూ.. “దేశంలో ఉన్న గొప్ప కథన సంప్రదాయాలపై ఆధారపడిన నేటి సృజనకర్తలు.. భారతీయ కథలను ప్రపంచ ప్రేక్షకుల వరకు తీసుకెళ్లే అవకాశాన్ని పొందుతున్నారు. మేధో సంపత్తి వ్యవస్థలను బలోపేతం చేయడం, భవిష్యత్తుకు అనుకూలమైన సృజనాత్మక వ్యవస్థను అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు వారికి తోడ్పడుతున్నాయి. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా దేశంలో సృష్టించి, ప్రపంచానికి అందించడానికి ఇదే సరైన సమయం. సమాచారం, సృజనాత్మకత, సంస్కృతి భారత ఆర్థిక వ్యవస్థలో కీలక భాగాలుగా ఎదుగుతున్నాయి. సృజనకర్తలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ప్రభావంతో కథనకళ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న ఈ సమయంలో.. ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్ వంటి కార్యక్రమాలు సమాజ సేవలో సృజనాత్మకతను ఎలా వినియోగించవచ్చో చాటిచెబుతున్నాయి” అని పేర్కొన్నారు.

భారత ప్రభుత్వానికి ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ మాట్లాడుతూ ఇలా అన్నారు. “సామాజిక ప్రాముఖ్యత కలిగిన ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, నైపుణ్యాలను, విజ్ఞాన మార్గాలను బలోపేతం చేసే విధంగా “ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్” కార్యక్రమాన్ని రూపొందించాం. సృజనాత్మక ప్రక్రియ ద్వారా అంకుర సంస్థలు, విద్యార్థులను ఒకచోట చేర్చడం, అలాగే నెట్‌ఫ్లిక్స్ ఫండ్ ఫర్ క్రియేటివ్ ఈక్విటీ, పారిశ్రామికవేత్తల మార్గదర్శకత్వంతో నైపుణ్య శిక్షణ అందించడం విశేషం. ప్రభుత్వ విధానాల లక్ష్యాలను, ప్రతిభా వికాసం, వాస్తవ ప్రపంచ అన్వయంతో అనుసంధానిస్తూ దేశ ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించడంలో ఈ కార్యక్రమం ఒక సమగ్ర దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది”.

భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు మాట్లాడుతూ.. “అసాధారణమైన ఆవిష్కరణలకు సాక్ష్యంగా భారత్ నిలుస్తోంది. సామాజిక ఆవిష్కర్తలు తమ ప్రభావవంతమైన, లక్ష్య ఆధారిత పరిష్కారాల ద్వారా రోజువారీ సవాళ్లను పరిష్కరిస్తూ ఈ మార్పును ముందుకు తీసుకెళుతున్నారు. నెట్‌ఫ్లిక్స్ భారతదేశంలో పదేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో “ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్” కార్యక్రమం ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. కథలు చెప్పడం అనేది కేవలం కంటెంట్ సృష్టించడమే కాకుండా అది ఒక అర్థవంతమైన నైపుణ్యాభివృద్ధి, సాధికారత వేదికగా ఎలా మారుతుందో ఇది నిరూపించింది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న యువ ప్రతిభావంతుల విశ్వాసాన్ని, వృత్తి నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది నిజంగా సృజనకారుల, కథల యుగం. కృత్రిమ మేధ ఆధారిత కథనాలు రూపుదిద్దుకుంటున్న ఈ కాలంలో తదుపరి తరం వృద్ధికి, పురోగతికి తోడ్పడే నూతన సాంకేతికతలను అందించడం చాలా ముఖ్యం. దేశానికి చెందిన అర్థవంతమైన, ఉద్దేశ్యపూర్వకమైన కథలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల కు చేరువ కావడం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుంది.” అని తెలిపారు.

నెట్‌ఫ్లిక్స్ ఇండియాలో గ్లోబల్ అఫైర్స్ డైరెక్టర్ మహిమా కౌల్ మాట్లాడుతూ ఇలా అన్నారు. “నెట్‌ఫ్లిక్స్‌లో వేం భారతదేశంలోని యువ, సృజనాత్మక వ్యవస్థకు నైపుణ్య శిక్షణ, నైపుణ్యాభివృద్ధిని అందించడానికి కట్టుబడి ఉన్నాం. నిజమైన సామాజిక విలువను అందించే ఆవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించాలనే ఉమ్మడి లక్ష్యానికి ‘ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్’ ఒక నిదర్శనం.

ఎక్కడా చెత్త ఉండొద్దు..

అమరావతి, జనవరి 16: స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పట్టణంలోని వల్లప్ప చెరువు పరిసరాలు, కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం వద్ద నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చిన సందర్భంగా ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రోజుకు పలుమార్లు చెత్త సేకరణ జరగేలా ప్రణాళిక రూపొందించాలని పురపాలక సంఘం అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. డ్రెయిన్ల శుభ్రత, రోడ్ల పక్కన చెత్త తొలగింపు, ప్రజా ప్రదేశాల్లో శానిటేషన్ స్ప్రే వంటి పనులు వేగవంతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పండుగ వేళ పట్టణం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకోగలుగుతారన్నారు. స్వచ్ఛత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని ప్రజలు కూడా చెత్తను ఎక్కడికక్కడ వేయకుండా సహకరించా లన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులకు అవసరమైన భద్రతా సామగ్రి, గ్లౌజ్, మాస్కులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పండుగ రోజుల్లో అదనపు సిబ్బందిని నియమించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుధ్య విభాగ సిబ్బంది, పాల్గొన్నారు.

క్షేమంగా వెళ్లండి..

-గుడివాడ రూరల్ ఎస్సై చంటిబాబు

అమరావతి, జనవరి 16:గుడివాడ రూరల్ ఎస్సై చంటిబాబు, సిబ్బంది సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గుడివాడకు వచ్చేవారికి, పండుగ సంబరాలు ముగించుకుని తిరిగి ప్రయాణమయ్యే ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రజలకు ముఖ్యంగా క్రింది రోడ్డు భద్రతా సూచనలు తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ ప్రయాణికులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

అధిక వేగంతో వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదన్నారు. రాత్రి ప్రయాణాల్లో హెడ్‌లైట్స్ సరిగ్గా ఉపయోగించాలని, చిన్నారులను వాహనాలపై సురక్షితంగా కూర్చోబెట్టాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పండుగ ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యానికి చేరుకుని ఈ పండుగను సంతోషంగా ముగించాలని గుడివాడ రూరల్ పోలీసులు కోరారు.

న్యూఢిల్లీలో 28వ ‘సీఎస్‌పీఓసీ’ని ప్రారంభించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 16:న్యూఢిల్లీలో పార్లమెంటు భవన ప్రాంగణంలోని చారిత్రక సంవిధాన సదన్ సెంట్రల్ హాల్‌లో కామన్వెల్త్ స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారుల 28వ సదస్సును (సీఎస్‌పీఓసీ) ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, దౌత్యానికి భారత్ ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యాన్ని ఈ కార్యక్రమం అంతర్జాతీయ స్థాయిలో చాటి చెబుతుంది.

ప్రారంభ సమావేశంలో గౌరవనీయ ప్రధానమంత్రి కీలక ప్రసంగం చేస్తారు. అనంతరం కామన్వెల్త్, స్వయంప్రతిపత్తి గల చట్టసభల స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారులతో సంభాషిస్తారు.

ఈ నెల 16 వరకూ న్యూఢిల్లీలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ‘సీఎస్‌పీఓసీ’ సచివాలయ సమన్వయంతో భారత పార్లమెంటు ఆతిథ్యమిస్తోంది. తద్వారా ఒక అంతర్జాతీయ కీలక పార్లమెంటరీ కార్యకలాపాలకు భారత్ కూడలిగా నిలుస్తోంది. కామన్వెల్త్‌లోని 53 జాతీయ చట్టసభల స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారులను ఈ సదస్సు ఒకే చోటకు చేరుస్తుంది. ప్రజాస్వామ్య పాలన, రాజ్యాంగ సంస్థల బలోపేతంలో శాసనసభల పరిణామశీల పాత్రపై చర్చలకు ఇదొక ఉన్నత స్థాయి వేదికగా ఉపయోగపడుతుంది.

ఈ నెల 14న న్యూఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలోగల సంగీతి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ‘సీఎస్‌పీఓసీ’ స్థాయీ సంఘం సమావేశానికి 28వ ‘సీఎస్‌పీఓసీ’ చైర్‌పర్సన్ హోదాలో గౌరవనీయ లోక్‌సభ స్పీకర్ అధ్యక్షత వహించారు. దీనికిముందు వివిధ దేశాల ప్రతినిధులు ఎర్రకోటను సందర్శించారు. ఈ సందర్భంగా ‘లైట్ అండ్ సౌండ్’ ప్రదర్శన నిర్వహించారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య ప్రస్థానానికి ప్రతీక అయిన ఈ స్మారక చిహ్నంలో ఈ ప్రదర్శన భారత సుసంపన్న నాగరికత, శాశ్వత వారసత్వాలను సందర్శక ప్రముఖుల అనుభవంలోకి తెచ్చింది.

ఈ సదస్సులో భాగంగా 15, 16 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలు ఆధునిక చట్టసభల సంబంధిత సమకాలీన అంశాలపై దృష్టి సారిస్తాయి. పార్లమెంటరీ కార్యకలాపాల్లో కృత్రిమ మేధ బాధ్యతాయుత వినియోగం, పార్లమెంటరీ విధానాలు, సార్వత్రిక చర్చలపై సామాజిక మాధ్యమాల ప్రభావంపై ఈ సందర్భంగా చర్చ సాగుతుంది. అలాగే పార్లమెంటుపై ప్రజల అవగాహన, ఓటింగ్ సహా పౌర భాగస్వామ్యం పెంచే వినూత్న విధానాలు, ఎంపీలు-పార్లమెంటరీ అధికారుల భద్రత, ఆరోగ్యం, శ్రేయస్సు వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వస్తాయి.

బలమైన ప్రజాస్వామ్య సంస్థల నిర్వహణలో స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారుల పాత్రపై ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి గౌరవనీయ లోక్‌సభ స్పీకర్ ప్రసంగిస్తారు. అంతేకాకుండా సర్వసభ్య, ప్రత్యేక సర్వసభ్య, ముగింపు సర్వసభ్య సమావేశాలకూ అధ్యక్షత వహిస్తారు.

భారత పార్లమెంట్ ఇంతకు ముందు 1971, 1986, 2010 సంవత్సరాల్లోనూ ‘సీఎస్‌పీ ఓసీ’ సమావేశాలను నిర్వహించింది. ఈ సంప్రదాయానికి కొనసాగింపుగా ప్రస్తుత 28వ ‘సీఎస్‌పీఓసీ’కి కూడా ఆతిథ్యమిస్తోంది. కామన్వెల్త్ పార్లమెంటరీ సంప్రదాయంతో భారత్ నిరంతర సంబంధాలను, ప్రజాస్వామ్యబద్ధ చట్టసభల మధ్య సంభాషణ, సహకారం, సంస్థాగత పునరుత్థాన సామర్థ్య వికాసం తదితరాల్లోనూ తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

ఈ సదస్సు నేపథ్యంలో కెనడా హౌస్ ఆఫ్ కామన్స్ స్పీకర్ శ్రీ ఫ్రాన్సిస్ స్కార్పలెగ్గియా; శ్రీలంక పార్లమెంట్ స్పీకర్ డాక్టర్ శ్రీ జగత్ విక్రమరత్నే; సీషెల్స్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ శ్రీమతి అజరెల్ ఎర్నెస్టా; మాల్దీవ్స్ పీపుల్స్ మజ్లిస్ స్పీకర్ శ్రీ అబ్దుల్ రహీం అబ్దుల్లా; కెన్యా జాతీయ అసెంబ్లీ స్పీకర్ శ్రీ మసికా వెటాంగులా; గ్రెనడా సెనేట్ అధ్యక్షురాలు డాక్టర్ డెస్సిమా విలియమ్స్; దక్షిణాఫ్రికా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ప్రావిన్సెస్ డిప్యూటీ చైర్‌పర్సన్ శ్రీ పూబాలన్ గోవేందర్; దక్షిణాఫ్రికా నేషనల్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ శ్రీ అన్నేలీ లాట్రియెట్ తదితరులతో లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.

కాగా, సదస్సు అజెండా, ఇతర విధివిధానాలపై ‘సీఎస్‌పీ ఓసీ’ స్థాయీ సంఘం ఇవాళ సమావేశమై చర్చించింది.కామన్వెల్త్ కూటమిలో ప్రజా స్వామ్య విలువలు, సంస్థాగత సమగ్రత, ప్రభావశీల పార్లమెంటరీ పర్యవేక్షణపై సమష్టి నిబద్ధ తను ప్రస్తుత 28వ ‘సీఎస్‌పీఓసీ’ బలోపేతం చేస్తుందని, ప్రపంచ పార్లమెంటరీ సంబంధాలకు విశ్వసనీయ, బాధ్యతాయుత సమన్వయకర్తగా భారత్ ప్రధాన పాత్రను చాటిచెబు తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

తొమ్మిది కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రకటనను స్వాగతించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 16:దేశవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యాన్ని, అనుసంధానతను మెరుగుపరచడంలో కొత్త అమృత్ భారత్ రైళ్లు కీలక ముందడుగని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

వివిధ మార్గాల్లో తొమ్మిది కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ‘ఎక్స్’ వేదికగా చేసిన ఒక పోస్టుకు స్పందిస్తూ.... ఈ నిర్ణయం వల్ల కలిగే విస్తృత ప్రయోజనాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు.

ప్రయాణికుల అనుభవాన్ని, అనుసంధానతను మెరుగుపరచడంతో పాటుగా ఈ కొత్త అమృత్ భారత్ రైళ్లు వాణిజ్యం, పర్యాటకాన్ని ప్రోత్సహించడంలోనూ సహాయపడతాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆధునిక ప్యాసింజర్ రైళ్ల నెట్‌వర్క్‌ను మరింత విస్తరిస్తూ... తొమ్మిది కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ‘ఎక్స్’ వేదికగా ప్రకటించారు.

‘మేక్ ఇన్ ఇండియా ఇన్ స్పోర్ట్స్’, ‘అంతర్జాతీయ సంబంధాలు’ కమిటీలను వేయాల్సిందిగా జాతీయ క్రీడా సమాఖ్యలకు యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సలహా

న్యూఢిల్లీ, జనవరి 16: గుర్తింపు గల జాతీయ క్రీడా సమాఖ్యలు (ఎన్ఎస్ఎఫ్‌లు) అన్నీ తమ తమ సంస్థల్లో అంతర్జాతీయ సంబంధాలు, మేక్ ఇన్ ఇండియా ఇన్ స్పోర్ట్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేయాల్సిందిగా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సలహా ఇచ్చింది.

క్రీడా రంగంలో అంతర్జాతీయ స్థాయిలో భారత్ స్థానాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ సంబంధాల కమిటీ.. సంబంధిత అంతర్జాతీయ సమాఖ్యలు (ఐఎఫ్‌లు), ఖండాల సమాఖ్యలు (సీఎఫ్‌ల)లో చోటుచేసుకొంటున్న పరిణామాలను పర్యవేక్షిస్తుంది. పోటీ నియమాల్లో, స్వరూపాల్లో మార్పులు, పరిపాలన ప్రణాళికలు, ఎన్నికలు, క్రీడాకారుల కోసం చేపట్టే కార్యక్రమాల్ని కూడా ఈ కమిటీ పరిశీలిస్తూ ఉంటుంది.

అంతర్జాతీయ స్థాయి సహకారానికి సంబంధించిన మధ్యకాలిక ప్రణాళికను కూడా ఈ కమిటీ రూపొందిస్తుంది. ద్వైపాక్షిక, బహుపార్శ్విక ఎంఓయూలు, సంయుక్త శిక్షణ శిబిరాలు, ఒక దేశం క్రీడాకారులు ఇతర దేశాల్లో పర్యటించడం, సాంకేతిక బదిలీ కార్యక్రమాలు, భారత్‌లో అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల్ని నిర్వహించడం వంటివి ఈ కమిటీ పరిధిలోకి వస్తాయి.

అంతర్జాతీయ ఏర్పాట్లన్నీ కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఒలింపిక్ ప్రణాళిక, ఐఎఫ్ చట్టాలకు అనుగుణంగా ఉండేటట్లు ఈ కమిటీ చూస్తుంది. సుపరిపాలనతో పాటు డోపింగ్ వ్యతిరేక నియమాల పాలనకూ కట్టుబడి ఈ కమిటీ పనిచేస్తుంది. క్రీడాకారుల ప్రయోజనాల్ని కూడా కమిటీ కాపాడుతుంది.

ఇతర దేశాల్లోని జాతీయ సమాఖ్యలతో, ప్రధాన అంతర్జాతీయ క్రీడా పరిశోధన, క్రీడా విద్యాసంస్థలతో సమన్వయాన్ని ఈ కమిటీ మరింత బలపరుస్తుంది. భారతీయ క్రీడాకారులకు అత్యుత్తమ స్థాయి శిక్షణావకాశాలతో పాటు స్పోర్ట్స్ సైన్సు పరంగా సహాయం లభించేటట్లు చూస్తుంది.

అంతర్జాతీయ సమాఖ్యలతో, సంబంధిత సంఘాలతో ఈ కమిటీ సమన్వయాన్ని ఏర్పరు చుకుంటుంది. అంతర్జాతీయ ఈవెంట్లను భారత్‌లో నిర్వహించడానికి సంబంధించిన అన్ని ప్రతిపాదనల సమాచారాన్ని మంత్రిత్వ శాఖతో ముందుగానే పంచుకొంటుంది. ఎప్పటికప్పుడు వేలం ప్రక్రియల్లో పాలుపంచుకొంటూ ఉంటుంది. అవసరమైన సందర్భాల్లో ముందస్తు సంప్రదింపులు జరపడం, అప్పటికి అమల్లో ఉన్న మార్గదర్శకాల ప్రకారం అనుమతి పొందడం కూడా ఈ కమిటీ విధులే.

మేక్ ఇన్ ఇండియా ఇన్ స్పోర్ట్స్ కమిటీ ఉత్పాదనల అభివృద్ధి, ప్రయోగాలు, సంబంధిత క్రీడాంశంలో ధ్రువీకరణకు మార్గాన్ని సుగమం చేయడానికి భారతీయ తయారీదారు సంస్థలు, అంకుర సంస్థలు, పరిశోధన సంస్థలు, పరీక్షల నిర్వహణ, ప్రమాణీకరణ సంస్థలతో సంప్రదింపులు జరుపుతుంది. మేక్ ఇన్ ఇండియాలో సంకల్పం చెప్పుకొన్న ప్రకారం దేశీయ క్రీడా సంబంధిత తయారీ అనుబంధ విస్తారిత వ్యవస్థను ప్రోత్సహిస్తుంది ఈ కమిటీ.

దేశవాళీ పరిష్కారాలను అనుసరించడంపై నిర్ణీత కాలానికి నివేదికల్ని రూపొందించడం, చోటు చేసుకున్న పురోగతిని ప్రధానంగా ప్రస్తావించడం, ఎదురవుతున్న ఇబ్బందుల్ని పేర్కొనడం, ఎన్ఎస్ఎఫ్ పరిధిలో పరిశీలించడానికి అనువుగా సిఫారసులను చేయడం, మరీముఖ్యంగా మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ఆశయ సాధనకు ఏ రకంగా తోడ్పాటును అందించవచ్చో అనే విషయాలపై ఈ కమిటీ శ్రద్ధ తీసుకొంటుంది.

సమాఖ్యలోని సీనియర్ సభ్యులు, ఇదివరకు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు, ప్రపంచ క్రీడా పరిపాలన, దౌత్యం రంగాల్లో అనుభవం గల సబ్జెక్టు నిపుణులకు ఈ కమిటీలో సభ్యత్వాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

కమిటీలో ఎవరెవరిని వేశారు, ఏయే అంశాలను కమిటీ పరిశీలనకు సూచించారనేవి సహా వివరాలను ఈ సూచనను జారీ చేసినప్పటి నుంచి 30 రోజుల లోపల మంత్రిత్వ శాఖకు తెలపాలి.

ముగ్గుల పోటీలతో చైతన్యం

న్యూఢిల్లీ, జనవరి 16: మహిళలలో చైతన్యం తేవడానికి సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని రంగవల్లుల పోటీలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే సతీమణి జూలకంటి శోభారాణి శుక్రవారం అన్నారు. ఈ ముగ్గుల పోటీలలో పాల్గొనేందుకు మహిళలు చైతన్యవంతులై ముందుకొచ్చి ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు రంగురంగుల ముగ్గులను వేసి ప్రతి ఒక్కరిని ఆకర్షింపచేశారు. మండల కేంద్రంలోని సీతారాముల దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జూలకంటి గౌతమ్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. మహిళలు వేసిన ముగ్గుల పోటీలను పరిశీలించి గెలుపొందిన మహిళా మణులకు బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. హిందూ సనాతన ధర్మంలో ప్రతి పండుగలో ఘనంగా జరుపుకునేందుకు మహిళలు ముందుండాలన్నారు.

న్యూఢిల్లీలో పొంగల్ వేడుకలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొంగల్ ప్రపంచ పండుగలా మారింది: పీఎం

న్యూఢిల్లీ, జనవరి 16:ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించిన పొంగల్ వేడుకలనుద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. తమిళంలో శుభాకాంక్షలు చెప్పిన శ్రీ మోదీ... "ఈ రోజు పొంగల్ ఒక ప్రపంచ పండుగలా మారింది" అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులు, తమిళ సంస్కృతిని ప్రేమించే వారంతా ఉత్సాహంగా పొంగల్ని నిర్వహించుకుంటున్నారనీ, తానూ వారిలో ఒకడినని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ ప్రత్యేక పండుగను అందరితో కలిసి జరుపుకోవడం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. తమిళుల జీవితంలో ఒక ఆహ్లాదకరమైన అనుభూతి లాంటిదనీ... ఇది రైతుల శ్రమకు, భూమికి, సూర్యుడికి కృతజ్ఞతలు తెలిపే పండుగ అని శ్రీ మోదీ తెలిపారు. అదే సమయంలో ప్రకృతిలో, కుటుంబంలో, సమాజంలో సమతుల్యత దిశగా మనకు ఈ పండుగ మార్గ నిర్దేశం చేస్తుందని ప్రధాన మంత్రి అన్నారు. ఈ సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాలూ లోహ్రీ, మకర సంక్రాంతి, మాఘ బిహు, ఇతర పేర్లతో ఈ పండుగ చేసుకుంటున్నారని శ్రీ మోదీ పేర్కొన్నారు. పొంగల్ పండుగ సందర్భంగా దేశవిదేశాల్లో ఉన్న తమిళ సోదరీ సోదరులందరికీ ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగల సందర్భంగా ప్రజలందరికీ ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

గత సంవత్సరంలో తమిళ సంస్కృతికి సంబంధించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. తమిళ నాడులోని వెయ్యేళ్ల నాటి గంగై కొండ చోళపురం ఆలయంలో తాను పూజలు చేసినట్లు ఆయన తెలిపారు. వారణాసిలో జరిగిన కాశీ తమిళ సంగమం సందర్భం లోనూ తాను సాంస్కృతిక ఐక్యతా శక్తిని నిరంతరం అనుభూతి చెందానని, దానితో అనుసంధానమై ఉన్నాననీ ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పంబన్ వంతెన ప్రారంభోత్సవం కోసం తాను రామేశ్వరాన్ని సందర్శించిన సందర్భంలో మరోసారి తమిళ చరిత్ర గొప్పతనాన్ని చూశానని ఆయన గుర్తు చేసుకున్నారు. తమిళ సంస్కృతి యావత్ దేశానికి, నిజానికి మానవాళి అందరికీ ఉమ్మడి వారసత్వమని స్పష్టం చేసిన ప్రధానమంత్రి... తాను తరచుగా ప్రస్తావించే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తి పొంగల్ వంటి పండుగల ద్వారా మరింత బలపడుతుందని ఉద్ఘాటించారు.

ప్రపంచంలోని దాదాపు అన్ని నాగరికతల్లోనూ పంటలకు సంబంధించి ఏదో ఒక పండుగను జరుపుకొంటారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. తమిళ సంస్కృతిలో రైతును జీవనానికి మూలస్తంభంగా భావిస్తారని ఆయన తెలిపారు. తిరుక్కురల్‌లో వ్యవసాయం, రైతుల గురించి విస్తృతంగా ప్రస్తావించారని శ్రీ మోదీ పేర్కొ న్నారు. రైతులు దేశ నిర్మాణంలో బలమైన భాగస్వాములని, వారి కృషి ఆత్మనిర్భర్ భారత్ కు గొప్ప బలాన్నిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. రైతులకు సాధికారత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేయడానికి కట్టుబడి ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

ప్రకృతి పట్ల కృతజ్ఞత కేవలం మాటలకే పరిమితం కాకుండా... అది మన జీవనశైలిలో భాగంగా మారేలా చూసుకోవడానికి పొంగల్ పండుగ మనకు స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యానించారు. భూమి మనకు ఇంతగా ఇస్తున్నప్పుడు, దానిని పరిరక్షించడం మన బాధ్యత అవుతుందని ఆయన స్పష్టం చేశారు. నేలను ఆరోగ్యంగా ఉంచడం, నీటిని సంరక్షించడం, భవిష్యత్ తరాల కోసం వనరులను సమతుల్య పద్ధతిలో ఉపయోగించడం అత్యంత ఆవశ్యకమని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. మిషన్ లైఫ్, ఏక్ పేడ్ మా కే నామ్, అమృత్ సరోవర్ వంటి ప్రచారాలు ఇదే స్ఫూర్తిని ముందుకు తీసుకువెళుతున్నాయని ఆయన వివరించారు. వ్యవసాయాన్ని మరింత సుస్థిరంగా, పర్యావరణ హితంగా మార్చడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రాబోయే కాలంలో సుస్థిర వ్యవసాయ పద్ధతులు, నీటి యాజమాన్యం (తానిచ్చిన 'పర్ డ్రాప్- మోర్ క్రాప్' పిలుపును పునరుద్ఘాటించారు), ప్రకృతి వ్యవసాయం, అగ్రిటెక్, విలువ జోడింపులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అన్ని రంగాల్లో యువత కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారని శ్రీ మోదీ పేర్కొన్నారు. కొన్ని నెలల కిందట తాను తమిళ నాడులో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఒక సదస్సుకు హాజరైనప్పుడు... వృత్తి జీవితంలోని ముఖ్యమైన అంశాలను వదిలి పొలాల్లో పనిచేస్తున్న తమిళ యువత చేస్తున్న అద్భుత కృషిని తాను చూశానని ఆయన గుర్తు చేసుకున్నారు. నుస్థిర వ్యవసాయంలో విప్లవం తీసుకురావడానికి ఉద్దేశించిన ఈ ప్రచారాన్ని మరింత విస్తరించాలని... వ్యవసాయ రంగంలో నిమగ్నమైన తన యువ తమిళ మిత్రులను ప్రధానమంత్రి కోరారు. మన పళ్ళెం నిండుగా ఉండాలి... మన జేబు నిండుగా ఉండాలి... మన భూమి సురక్షితంగా ఉండాలి అనేవి మన లక్ష్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

''ప్రపంచంలోని అత్యంత పురాతనమైన సజీవ నాగరికతల్లో తమిళ సంస్కృతి ఒకటి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. తమిళ సంస్కృతి శతాబ్దాలను పరస్పరం అనుసంధానిస్తోందని... చరిత్ర నుంచి నేర్చుకుంటుందని... వర్తమానాన్ని భవిష్యత్తు దిశగా నడిపిస్తుందని ఆయన వివరించారు. దీని నుంచి స్ఫూర్తి పొందిన నేటి భారత్ తన మూలాల నుంచి బలాన్ని పొంది కొత్త అవకాశాల దిశగా ముం దుకు సాగుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పవిత్రమైన పొంగల్ పండుగ సందర్భంగా, దేశాన్ని ముందుకు నడిపించే విశ్వాసాన్ని మనం అందిపుచ్చుకుంటున్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఇది తన సంస్కృతితో అనుసంధానమైన, తన భూమిని గౌరవించే, తన భవిష్యత్తు పట్ల విశ్వాసంతో నిండిన దేశమని శ్రీ మోదీ తెలిపారు. తమిళంలో పొంగల్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

అమరావతి, జనవరి 16:మండల పరిధిలోని కోలగుట్ల గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ముటుకూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రవీంద్ర (25), ఆతని మామ మండ్లి బై స్వామి ద్విచక్ర వాహనం పై అనుపాలెం గ్రామానికి వ్యక్తి గత పనులపై వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం దుర్గి మండలం కొలగుట్ల గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రవీంద్ర మృతి చెందగా, బైస్వామికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదే హాన్ని, గాయాలపాలైన వ్యక్తిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేశఖండన శాల ఆకస్మిక తనిఖీ..

భక్తుల సౌకర్యాలపై దుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు అవ్వరు బుల్లిబాబు ఆరా

విజయవాడ, జనవరి 16: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని కేశఖండన శాలను దుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు అవ్వరు బుల్లిబాబు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు జారీ చేస్తున్న టిక్కెట్ల విధానం, కేశఖండన శాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు.

భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో అక్కడికి వచ్చిన భక్తులతో అవ్వరు బుల్లిబాబు మాట్లాడి వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. భక్తుల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. కేశఖండన శాల పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని ఆలయ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

-షుగర్ డౌన్ కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తి
-సకాలంలో వైద్య సేవలు అందించిన 108 సిబ్బంది

అమరావతి, జనవరి 16: నందివాడ మండలం దండిగనపూడి గ్రామంలో శుక్రవారం ఉదయం సుమారు 6 గంటల నుంచి రాజు అనే వ్యక్తి అపస్మారక స్థితిలో వెళ్లాడు. రాజు(50) బాపులపాడు మండలం ఆరుగోలను గ్రామం నుంచి జీవనాన్ని సాగించేందుకు దండిగానపూడిలో చెరువుపై కావలా వ్యక్తిగా ఉంటున్నాడు. అపస్మారక స్థితిలో రాజు పరిస్థితి గమనించిన చెరువు యజమాని 108 సిబ్బందికి కాల్ చేయడంతో సత్వరమే స్పందించి హుటాహుటిన దండిగానపూడి చేరుకున్నారు. రాజుకు వైద్య పరీక్షలు నిర్వహి ంచి షుగర్ డౌన్ అయిందని నిర్ధారణ చేసుకున్నారు. వైద్యులతో సంప్రదించి, రాజుకు వైద్యం చేశారు.

ప్రథమ చికిత్సలో భాగంగా షుగర్ బీపీ పరీక్షలు నిర్వహించి రాజుకు షుగరు 45 పడిపోవడంతో ఈఆర్సీపీ డాక్టర్ తేజ అనుమతితో డి25 సెలైన్ ఎక్కించారు. కొంత సమయానికి రాజు అపస్మారక స్థితి నుంచి తేరుకున్నాడు. మళ్ళీ కళ్ళు తెరుస్తానని అనుకోలేదని సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపాడు. సకాలంలో రావడమే కాకుండ చెరువుపై డాక్టర్ సలహాలు సూచనలతో చేపల చెరువుపై వైద్యం చేసిన 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఎర్రంశెట్టి నాగమల్లేశ్వరి పైలెట్ వెలగలేటి సుమన్ అభినందించారు. గుడివాడలో 108 సేవలు అద్భుతమని చెరువు యజమాని రాజారెడ్డి కొనియాడారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ఆదిలాబాద్, జనవరి 16: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి (కే) గ్రామం ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సూపర్ పత్తి , మొక్కజొన్న హైబ్రిడ్ విత్తన కంపెనీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

స్థానిక సర్పంచ్ బందెల గంగామణి సత్యనారాయణ, కంపెనీ ప్రతినిధి అభారావ్ సమక్షంలో పోటీలు జరిగాయి. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంత రం సర్పంచ్ గెలుపొందిన విజేతలకు బహుమతులు అంద జేశారు. మొదటి బహుమతి గెలుపొందిన బందెల రాణి కి ప్రెషర్ కుక్కర్, 2వ బహుమతి సాతం సన్నుతకు మిక్సీ, మరో 10 మందికి హాట్ బాక్సులు అందజేశారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దుంపెటి రాములు, ఉపసర్పంచ్ పట్టెపు పోశెట్టి, లంక పోశెట్టి, సుంకరి రఘు, మరాఠి శంకర్, ఓంకార్, రవి,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్య, ఉద్యోగం పేరుతో మోసం.. వ్యక్తి అరెస్ట్

నల్గొండ, జనవరి 16:విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి వద్ద నుండి భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిని నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ జి.రమేశ్ శుక్రవారం వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లికి చెందిన ముప్పాళ్ల లీలాకృష్ణ గతంలో విదేశాల్లో ఉద్యోగం చేసి భారత్‌కు తిరిగి వచ్చాడు. చెడు వ్యసనాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదిం చాలనే ఉద్దేశంతో అక్కడి పరిచయాలను ఉపయోగించుకుని విదేశాలకు వెళ్లాలని ఆసక్తి చూపుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నమ్మించాడు. ఇప్పటివరకు మొత్తం 8 మంది నుండి సుమారు రూ.85 లక్షల వరకు తీసుకుని మోసం చేసినట్లు గుర్తించారు. నల్లగొండ జిల్లా పోలేపల్లి రాంనగర్‌కు చెందిన కోయలకార్ కరుణభాయ్ కుమారుడిని విదేశాలకు పంపించి ఉన్నత చదువులు, ఉద్యోగం ఇప్పిస్తానని లీలాకృష్ణ చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశాడు. దీంతో బాధిత మహిళ చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ముప్పాళ్ల లీలా కృష్ణను పోలీసులు ఈ రోజు ఉదయం మాల్ గ్రామం మర్రిగూడలో రోడ్డులో అడువులోకి తీసుకున్నారు. విచారించగా ఇతడు నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో పలువురు విద్యార్థులను ఇదే తీరుగా మోసం చేసినట్లు వెలుగు చూసింది. నిందితుడి వద్ద నుండి ల్యాప్‌టాప్, మూడు స్మార్ట్ ఫోన్లు, వివిధ బ్యాంకులకు చెందిన డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నేరస్థుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నాంపల్లి సీఐ డి.రాజు, చింతపల్లి ఎస్ఐ ఎం.రామ్మూర్తి, ఇతర పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

ఏఐతో ఆర్థిక పర్యవేక్షణలో పరివర్తన కోసం ఫైనాన్షియల్ రిపోర్టింగ్ కాంప్లియెన్స్ ఛాలెంజ్‌ను ప్రారంభింభం

న్యూఢిల్లీ, జనవరి 16:ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వ శాఖ డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఆధ్వర్యంలోని స్వతంత్ర వ్యాపార విభాగం అయిన ఇండియాఏఐ... నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ సహకారంతో ఇండియాఏఐ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ కాంప్లి యెన్స్ ఛాలెంజ్‌ను ప్రారంభిం చింది.

ఇండియాఏఐ అప్లికేషన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్‌లో భాగమైన ఈ కార్యక్రమం... నియంత్రణా విధానాల కోసం ఆర్థిక పత్రాల ధృవీకరణను ఆటోమేట్ చేసే బలమైన ఏఐ ఇంజిన్‌ను అభివృద్ధి చేయడానికి భారతీయ అంకుర సంస్థలు, కంపెనీలను ఆహ్వానిస్తోంది. ఏఐ ప్రయోజనాలను ప్రజాస్వామ్యీ కరించడం లక్ష్యంగా ఈ పోటీని నిర్వహిస్తున్నారు.

స్కాన్ చేసిన, డిజిటల్ వెర్షన్ల లోని బహుళ-ఫార్మాట్ డాక్యుమె ంట్ మూలాల నుంచి టెక్స్ట్, పట్టి కలు, హైపర్‌లింక్‌లు, ఎంబెడెడ్ డేటా, ఆర్థిక డేటాను సంగ్రహిం చగలిగే... వాటిని లాజికల్, హెడర్-ఆధారిత విభాగాలుగా విభజించి... ప్రతి విభాగం పరిపూర్ణత, సమగ్రత, ముందుగా నిర్వచించిన ప్రణాళికకు అనుగుణ ంగా సమ్మతిని ధృవీకరించగలిగే ఏఐ-ఆధారిత ఇంజిన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా సమ్మతిలో అంతరాలను పరిష్కరించడానికి ఈ పోటీ ప్రయత్నిస్తుంది.

రాజ్యాంగ సౌధం సెంట్రల్ హాల్‌లో కామన్వెల్త్ స్పీకర్లు.. ప్రిసైడింగ్ ఆఫీసర్ల 28వ సదస్సుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రీకారం

న్యూఢిల్లీ, జనవరి 16:న్యూఢిల్లీలోని 'రాజ్యాంగ సౌధం'లోని సెంట్రల్ హాల్‌లో కామన్వెల్త్ స్పీకర్లు-ప్రిసైడింగ్ అధికారుల 28వ సదస్సును (సీఎస్‌పీఓసీ) ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ పాత్ర ఎంతో విశిష్టమైనదని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా చట్టసభల స్పీకర్లకు మాట్లాడే అవకాశం అంతగా ఉండదంటూ- ఇతరులు చెప్పేది వినడం, ప్రతి ఒక్కరి అభిప్రాయ వెల్లడికి అవకాశమివ్వడం వారి బాధ్యతని పేర్కొన్నారు. అత్యుత్సాహం చూపే, వివాదాస్పదంగా వ్యవహరించే సభ్యులను కూడా చిరునవ్వుతో నిభాయించే స్పీకర్ల లో సహనం అత్యంత సార్వత్రిక లక్షణమని అభివర్ణించారు.

ఈ ప్రత్యేక సందర్భంలో విశిష్ట అతిథులందరికీ సాదర స్వాగతం పలుకుతూ- వారి హాజరీ తమకెంతో గౌరవమని శ్రీ మోదీ అన్నారు. వారంతా ఆశీనులైన ఈ ప్రదేశానికి భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో ఎనలేని ప్రాధాన్యం ఉందని చెప్పారు. భారత స్వాతంత్ర్యం ఖాయమై, వలస పాలన అంతమయ్యే రోజులలో రాజ్యాంగ రూపకల్పన కోసం ఇదే సెంట్రల్ హాలులో రాజ్యాంగ పరిషత్ సమావేశమైందని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక 75 ఏళ్లపాటు ఈ భవనం జాతీయ చట్టసభ (పార్లమెంటు)గా పనిచేసిందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఎన్నో కీలక నిర్ణయాలతోపాటు చర్చలు ఇక్కడే సాగాయని వివరించారు. ఈ చారిత్రక ప్రదేశానికి 'రాజ్యాంగ సౌధం' (సంవిధాన సదన్)గా నామకరణం చేయడం ద్వారా దీన్ని ప్రజాస్వామ్యానికి అంకితం చేశామని శ్రీ మోదీ అన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చాక 75 ఏళ్ల వేడుకను భారత్ ఇటీవలే నిర్వహించుకున్నదని గుర్తుచేశారు. ఇంతటి విశిష్ట ప్రదేశంలో గౌరవనీయ అతిథులందరి హాజరీ భారత ప్రజాస్వామ్యానికి ఒక మరపురాని మధుర క్షణమని ఆయన ఉద్ఘాటించారు.

కామన్వెల్త్ స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారుల సదస్సును భారత్‌లో నిర్వహించడం ఇది నాలుగోదఫా అని ప్రధానమంత్రి గుర్తుచేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఆదానప్రదానమే ఈ సదస్సు ప్రధాన ఇతివృత్తమని ఆయన వివరించారు. భారత్ స్వాతంత్ర్యం పొందినపుడు... ఈ వైవిధ్యభరిత దేశంలో ప్రజాస్వామ్యం మనుగడపై ఆందోళన వ్యక్తమైందని శ్రీ మోదీ గుర్తు చేసుకున్నారు. అయితే, ఇదే వైవిధ్యాన్ని భారత్ తన ప్రజాస్వామ్య శక్తిగా మలచుకున్నదని ఆయన స్పష్టం చేశారు. అటుపైన దేశంలో ప్రజాస్వామ్యం ఏదో ఒకవిధంగా మనుగడ సాగించినా, అభివృద్ధి అసాధ్యమనే మరో వాదన బయలుదేరిందని ఆయన పేర్కొన్నారు. కానీ, "ప్రజాస్వామ్యానికి స్థిరత్వం, వేగం, స్థాయినిచ్చేది ప్రజాస్వామ్య సంస్థలు, ప్రక్రియలేనని భారత్ నిరూపించింది'' అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. భారత్ నేడు ప్రపంచంలో శరవేగంగా పురోగమిస్తున్న కీలక ఆర్థిక వ్యవస్థగా పరిగణనలో ఉన్నదని పేర్కొన్నారు. అలాగే 'యూపీఐ' విజయంతో ప్రపంచంలో అతిపెద్ద డిజిటల్ చెల్లింపు వ్యవస్థగల దేశంగా గుర్తింపు పొందిందని తెలిపారు. మరోవైపు అతిపెద్ద టీకా ఉత్పత్తిదారు.. రెండో అతిపెద్ద ఉక్కు ఉత్పత్తిదారు.. మూడో అతిపెద్ద అంకురావరణ వ్యవస్థ.. మూడో అతిపెద్ద విమానయాన మార్కెట్.. నాలుగో అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్.. మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్.. అతిపెద్ద పాల ఉత్పత్తిదారు.. రెండో అతిపెద్ద బియ్యం ఉత్పత్తి దారు- అంటూ భారత్ సాధించిన విజయాల జాబితాను ఆయన ఏకబిగిన వివరించారు.

"భారతదేశంలో ప్రజాస్వామ్యమంటే- చిట్టచివరి అంచెదాకా సేవా ప్రదానం" అంటూ... ఈ దేశం ప్రజా సంక్షేమ స్ఫూర్తితో పనిచేస్తుందని, వివక్షకు తావులేకుండా ప్రతి వ్యక్తికీ ప్రయోజనాలు చేరేలా చూస్తుందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ సంక్షేమ స్ఫూర్తి ఫలితంగానే- ఇటీవలి సంవత్సరాల్లో 25 కోట్ల మంది ప్రజలు పేదరిక విముక్తులయ్యారని వివరించారు. ఈ విధంగా "భారతదేశంలో ప్రజాస్వామ్యం పేదరికం నుంచి గట్టెక్కింది" అని ఆయన చెప్పారు.భారత ప్రజలు సర్వోన్నతులు కాబట్టే, ఈ దేశంలో ప్రజాస్వా మ్యం విజయవంతమైందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. వారి ఆశలు, ఆకాంక్షలకు ప్రాధాన్యమిస్తూ వాటి సాకారానికి ఎలాంటి అవరోధాలు ఎదురు కాకుండా వివిధ ప్రక్రియల అమలు నుంచి సాంకేతికత వినియోగం దాకా ప్రతిదీ ప్రజాస్వా మ్యబద్ధం చేసినట్లు ఆయన విశదీకరించారు. ఈ ప్రజాస్వామ్య స్ఫూర్తి భారతీయుల హృదయాల్లో, జీవనాడులలో నిరంతరం ప్రవహిస్తూంటుందని పేర్కొన్నారు. యావత్ ప్రపంచం ఇబ్బందులు పడుతుండగా వచ్చిన కోవిడ్-19 మహమ్మారిని శ్రీ మోదీ ఉదాహరించారు. అప్పటికే దేశం సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ 150కిపైగా దేశాలకు మందులు, టీకాలను భారత్ సరఫరా చేసిందని గుర్తుచేశారు. ప్రజా ప్రయోజనాలు, సంక్షేమం, శ్రేయస్సు లక్ష్యంగా సేవలందించడమే భారత నైతిక విలువలకు నిదర్శనమని, ఈ దేశ ప్రజాస్వామ్యం వాటిని పెంచిపోషించిందని ఆయన ఉద్ఘాటించారు.భారత్‌ను అతిపెద్ద ప్రజా స్వామ్యంగా ప్రపంచ పౌరులలో అధికశాతం గుర్తిస్తున్నారని చెబు తూ- ఈ దేశ ప్రజాస్వామ్య పరిధి నిజంగా అసాధారణమని శ్రీ మోదీ ప్రకటించారు. దేశంలో 2024నాటి సార్వత్రిక ఎన్నికలను ప్రస్తావిస్తూ- మానవాళి చరిత్రలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియగా దీన్ని అభివర్ణించారు. ఈ ఎన్నికలలో దాదాపు 98 కోట్ల మంది వయోజనులు ఓటు హక్కు కోసం నమోదయ్యారని, ఇది కొన్ని ఖండాల జనాభా మొత్తం కన్నా ఎక్కువని గుర్తుచేశారు. అలాగే 700కుపైగా పార్టీల తరఫున 8,000 మందికి పైగా అభ్యర్థులు పోటీ చేసిన ఈ ఎన్నికలలో మహిళలు రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. ఈ విధంగా నేడు భారతీయ మహిళల భాగస్వామ్యం పెరగడమేగాక వారు మార్గద ర్శకులుగానూ నిలుస్తున్నారని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. భారత ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి ఒక మహిళ అని, ఈ సదస్సును నిర్వహిస్తున్న ఢిల్లీ నగర ముఖ్య మంత్రి కూడా ఒక మహిళేనని ఆయన గుర్తు చేశారు. దేశవ్యాప్త గ్రామీణ, స్థానిక ప్రభుత్వ సంస్థలలో దాదాపు 15 లక్షల మంది మహిళా ప్రతినిధులేనని, క్షేత్రస్థాయి నాయకులలో దాదాపు 50 శాతానికి ఇది సమానమని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ఆకట్టుకున్న సందేశాత్మక ముగ్గులు.. కానిస్టేబుల్ వనజపై ప్రశంసల జల్లు

జహీరాబాద్, జనవరి 16 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంక్రాంతి పండగ సందర్భంగా మహిళా పోలీసులు వేసిన సందేశాత్మక ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ ఆర్. వనజ రంగురంగుల ముగ్గులతో పోలీసుల విధులు.. ప్రజలకు పలు రకాల సూచనలతో అందంగా వేసిన ముగ్గ పలువురి ప్రశంశాలను అందుకుంది.

తెలంగాణ పోలీస్ లోగో తో అందంగా రూపొందించిన ముగ్గులో హెల్మెట్ ను ధరించి ప్రాణాలు తప్పించుకో.. చైనా మాంజా ప్రాణాలకు ముప్పు, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, ట్రాఫిక్ రూల్స్ పాటించండి సురక్షితంగా చేరుకోండి,ప్రాడ్ కాల్స్ పులిస్టాప్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదు, సత్యమేవ జయతే అంటూ ప్రజలకు సూచనలు.. పోలీసుల విధుల, బాధ్యతల గురించి వివరిస్తూ వేసిన ముగ్గ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. ఎస్ఐ కాశీనాథ్ తో పాటు తోటి పోలీస్ సిబ్బంది అభినందించారు.

రోడ్డు భద్రత పట్ల ఉద్యోగులు పౌరులను ప్రభావితం చేయాలి : డీఎస్పీ వి.ప్రసన్నకుమార్

వరంగల్, జనవరి 16:రోడ్డు భద్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యతను ఉద్యోగులు తీసుకోవాలని సూర్యాపేట డీఎస్పీ వి.ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మాస్సోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత, అరైవ్ ఎలైవ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించడంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. రోడ్డు భద్రత పట్ల సామాన్య ప్రజలను, యువతను ప్రభుత్వ ఉద్యోగులు ప్రభావితం చేయాలని కోరారు, ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ ధరించాలని, హై స్పీడ్ తో వాహనాలు నడపరాదని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యమంలా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో ఉద్యోగులు, పౌరులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా రోడ్డు భద్రత పట్ల నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహితంగా వాహనాలు నడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఎంఈఓ శ్రీనివాస్, ఆర్ ఎం ఓ లక్ష్మణ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, టౌన్ ఎస్ఐలు మహేంద్రనాథ్, శివ తేజ, ఐలయ్య, ఏఎంవిఐ విక్రమ్, ఏ ఎం వి ఐ సంపత్ పాల్గొన్నారు.

తమ అనుభవంలోని ముఖ్యాంశాల్ని పంచుకోనున్న ఎంపిక చేసిన అంకుర సంస్థల ప్రతినిధులు

న్యూఢిల్లీ, జనవరి 16:స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని అమలు చేయడం మొదలుపెట్టి పది సంవత్సరాలు పూర్తి అయిన దుకు గుర్తుగా 2026 జనవరి 16న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించే ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. అదే రోజు.. జాతీయ అంకుర సంస్థల దినం కూడా.ఈ కార్యక్రమంలో.. భారత్ లోని చైతన్యవంత అంకుర సం స్థల అనుబంధ విస్తారిత వ్యవస్థ సభ్యులతో ప్రధానమంత్రి మాట్లాడతారు. ఎంపిక చేసిన అంకుర సంస్థల ప్రతినిధులు త మ అనుభ వ ముఖ్యాంశాల్ని పం చు కుంటా రు. ఆహ్వానితులను ఉద్దేశి ంచి ప్రధానమంత్రి ప్రసం గిస్తారు.స్టార్టప్ ఇండియాను ప్రధాన మంత్రి 2016 జనవరి 16న ప్రా రంభించారు. మార్పు ను తీసుకు వచ్చే జాతీయ కార్యక్రమంగా దీనిని చేపట్టారు. ఉద్యోగాలు కావాలని కోరుకొనే వారి దేశంగా కన్నా, ఉద్యోగాల్ని ఇచ్చే వారి దేశంగా భారత్‌ను తీర్చిదిద్ద డంతో పాటు నవకల్పనను ప్రోత్స హిం చడం, నవ పారిశ్రా మిక త్వాన్ని పెంపొందించడం, పెట్టుబడులు ఊతంగా నిలిచే అభివృద్ధి సాధన దిశగా ఇండియాను ముందుకు తీసుకు పోవడం స్టార్టప్ ఇండియా లక్ష్యాలు.గత పదేళ్లుగా, దేశ ఆర్థిక, నవకల్పన స్వరూపం లో ఓ కీలక స్థానాన్ని స్టార్టప్ ఇం డియా పొందింది. సంస్థాగత యంత్రాం గాల్ని పటిష్ఠపరిచింది. పెట్టుబడితో పాటు మార్గద ర్శకత్వం పరి ధిని విస్తరించింది. అంకుర సంస్థ లు అన్ని రంగా ల్లో, అన్ని ప్రాం తాల్లో వర్ధిల్లేం దుకు, విస్తరించే ందుకు అనువైన వాతావరణాన్ని ఏర్పరిచింది. ఈ దశాబ్ద కాలంలో దేశ అంకుర సంస్థల అనుబంధ విస్తారిత వ్యవస్థలో గొప్ప విస్తరణ చోటుచే సుకుంది. దేశవ్యా ప్తంగా 2 లక్షలకు పైగా అంకుర సంస్థలకు గుర్తింపును ఇచ్చారు. ఈ వాణిస్య సంస్థలు ఉపాధి ని కల్పించడంలో, నవకల్పన ఊతంగా ఆర్థికాభి వృద్ధి చోటుచేసుకొ నేటట్లు చూడటంలో, వేర్వేరు రంగాల్లో దేశీయ సరఫరా వ్యవస్థల్ని బలోపేతం చే యడంలో కీలక పాత్రను పోషిస్తున్నాయి.

సాంస్కృతిక బంధాల బలోపేతం.. ఒకే భారత్-శ్రేష్ఠ భారత్ స్ఫూర్తి పెంపులో కాశీ తమిళ సంగమం ప్రగతిపై తన ఆలోచనలను ప్రజలతో పంచుకున్న ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 16:కాశీ తమిళ సంగమం సాధించిన ప్రగతిపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన ఆలోచనలను పొంగల్ పర్వదినం సందర్భంగా ప్రజలతో పంచుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే వైవిధ్య భారతంలో సంప్రదాయాలు, భాషలు, సమాజాలను ఏకం చేసే ఈ కార్యక్రమం సాంస్కృతిక ఆదానప్రదానానికి ఒక శక్తిమంతమైన వేదికగా మారిన తీరును ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

చసోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ సందర్భంగా సోమనాథ ఆలయాన్ని సందర్శించిన ప్రధానమంత్రి, కాశీ, సౌరాష్ట్ర తమిళ సంగమం వంటి కార్యక్రమాలపై అక్కడి పౌరులను ప్రశంసిస్తూ వారితో ముచ్చటించారు.

దీనిపై సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వేర్వేరు భాషల్లో పంపిన సందేశాల్లో:

""చసోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ సందర్భంగా సోమనాథ్‌ను సందర్శించినప్పుడు, పొంగల్ పర్వదినం సందర్భంగా కాశీ తమిళ సంగమం, సౌరాష్ట్ర తమిళ సంగమం నిర్వహించిన ప్రశంసనీయ కార్యక్రమాలపై అక్కడి ప్రజలను నేను కలిశాను. కాశీ తమిళ సంగమం పురోగమనం, 'ఒకే భారత్-శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని అది బలోపేతం చేసిన తీరుపై నా ఆలోచనలను వారితో పంచుకున్నాను" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

జన సంద్రమైన కొత్తకొండ.. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన జాతర

వరంగల్, జనవరి 16:హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురు, శుక్రవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. కోరిన కోరికలు తీర్చాలని స్వామి వారికి కోర మీసాలు సమర్పిం చుకున్నారు. తమ గండాలు తొలగిపోవాలని గండా దీపంలో నూనె పోశారు. వీరభద్రుని సన్నిధిలో కోడె ప్రదక్షిణ చేశారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించు కున్నారు.

స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ కట్టా రు. భక్తులు అధికం కావడంతో శీఘ్ర దర్శనం, విఐపి క్యూలైన్లు సైతం కిక్కిరిసిపోయాయి. జాత రలోని దుకాణాలు, రంగులరా ట్నం, సర్కస్ తదితర షాపులన్నీ రద్దీగా మారాయి. జాతరలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు వాటిలకుండా ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు పూర్తి సదుపాయాలు కల్పించారు.

మకర సంక్రాంతి పర్వదినం గురువారం అర్ధరాత్రి ఆనవాయితీ ప్రకారం వరంగల్ జిల్లా వేలేరు కు చెందిన యాద వులు దబ్బు చప్పుళ్ళు, శివసత్తులు నృత్యాల మధ్య మేకల బండితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎడ్లబండ్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి గుట్టపైన కొలువు దీరిన వీరభద్ర స్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి. గుట్టపైకి వెళ్ళిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గుట్టపైకి వెళ్లి ప్రకృతి రమణీయతను వీక్షించేందుకు యువత పోటీపడ్డారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర లోని అతని ఇంటి నుంచి కొత్త కొండకు ఎడ్ల బండి రథం మకర సంక్రాంతి రోజున వెళ్లడం అనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది సైతం ఎడ్ల బండి రథాన్ని అందంగా అలంకరించారు. శివ సత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్ల బండి రథాన్ని కొత్తకొండకు గ్రామస్తులు అంగరంగ వైభవంగా సాగనంపారు.

బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే చందంగా కొత్తపల్లి నుంచి కొత్తకొండకు వెళ్లిన ఎడ్లబండ్లు రథాలను తలపించాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం సుమారు 72 వరకు ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలంకరించి రథాలు గాతీర్చిదిద్దారు. కొత్తకొండ వరకు సాగిన ఎడ్ల బండి రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా ఎడ్ల బండ్లతో వచ్చి ఆలయ ప్రదక్షిణలు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మకర సంక్రాంతి పర్వదినాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు వారికి శేష వస్త్రాలు సమర్పించి స్వామి వారి మెమెంటోను ప్రధానం చేశారు. అంతకు ముందు త్రిశూల చౌరస్తాను ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తకొండ ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, ఇతరత్ర అభివృద్ధి పనులకోసం రూ. 70 కోట్లు నిధులు మంజూరు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి మందులు పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా అంబులెన్స్ ను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు జాతరలో అగ్నిమాపక సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు.

జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జూదం, మట్కా, గుట్కా, నాటుసారా లేకుండా పూర్తిస్థాయిలో పోలీసులు నియంత్రించారు. కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు ఏసీపీలు పదిమంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 350 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొని సేవలందించారు.

20న భారతీయ జనతా పార్టీకి రానున్న కొత్త అధ్యక్షుడు

న్యూఢిల్లీ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఈనెల 19వ తేదీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. 20వ తేదీన పార్టీ కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. బీజేపీ జాతీయ రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ ఆ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను రిలీజ్ చేశారు. జనవరి 19వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య నామినేషన్ దాఖలు చేసుకోవాలి. ఇక సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నామినేషన్ విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. ఒకవేళ అవసరం అయితే పోలింగ్ 20వ తేదీన నిర్వహించనున్నారు.

మాజీ సైనికులకు అర్హమైన గౌరవాన్ని ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తోందన్న రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 16:దేశ వ్యాప్తంగా 14 జనవరి 2026న 10వ రక్షణ దళాల పూర్వ సైనికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ సైనికుల ర్యాలీలు, పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించే కార్యక్రమాలు, ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, సహాయక డెస్క్‌లు వంటి వరుస కార్యక్రమాలు జరిగాయి. ఢిల్లీ లేదా ఎన్‌సీఆర్ ప్రాంతానికి చెందిన సుమారు 2,500 మంది మాజీ సైనికులు పాల్గొన్న ఢిల్లీ కాంట్ లోని మానేక్షా సెంటర్‌లో జరిగిన ప్రధాన వేడుకలకు రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా రక్షణ మంత్రి మాట్లాడుతూ.. మాజీ సైనికులను జాతీయ చైతన్యానికి సజీవ స్తంభాలుగా, సామూహిక ధైర్యానికి చిహ్నాలుగా, భావి తరాలకు స్ఫూర్తి ప్రదాతలుగా అభివర్ణించారు. వారి పరాక్రమానికి, త్యాగాలకు, అంకిత భావంతో కూడిన సేవలకు ఘనంగా నివాళులర్పిస్తున్నట్లు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. తమ అనుభవాల ద్వారా యువతకు మార్గనిర్దేశం చేయటం, అగ్నివీరులు- యువ సైనికులకు సరైన దిశానిర్దేశం చేయటం, అత్యవసర పరిస్థితుల్లో ప్రజా పాలనకు అండగా నిలవటం, సామాజిక సామరస్యాన్ని పెంపొంది ంచటం, క్షేత్రస్థాయిలో దేశభక్తి స్ఫూర్తిని మరింత బలోపేతం చేయటం ద్వారా బలమైన భవిష్యత్తు గల భారత్‌కు పునాది వేయాలని ఆయన వారిని కోరారు.

"నేడు భారత్ బలమైన, స్వావలంబన కలిగిన, అభివృద్ధి చెందిన దేశంగా మారే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఇటువంటి సమయంలో పూర్వ సైనికుల అనుభవం, నాయకత్వం, విలువలు దేశానికి అమూల్యమైన ఆస్తులుగా ఉంటాయి. మన సమాజం ముఖ్యంగా యువత మీ నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. విద్య, నైపుణ్యాభివృద్ధి, విపత్తు నిర్వహణ, సామాజిక నాయకత్వం లేదా ఆవిష్కరణలు.. ఇలా మార్గం ఏదైనా సరే మీ భాగస్వామ్యం భావి తరాలపై సానుకూల, శాశ్వత ప్రభావాన్ని చూపుతుంది" అని హాజరైన విశ్రాంత సైనికులతో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

దాదాపు 40 ఏళ్ల క్రితం శాంతి పరిరక్షణ కోసం భారత శాంతి పరిరక్షణ దళంలో (ఐపీకేఎఫ్) భాగంగా శ్రీలంకలో చేపట్టిన 'ఆపరేషన్ పవన్'లో పాల్గొన్న ధైర్యవంతులైన సైనికులను రక్షణ మంత్రి స్మరించు కున్నారు. "ఈ ఆపరేషన్ సమయంలో భారత దళాలు అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించాయి. చాలా మంది సైనికులు ప్రాణాలను అర్పించారు. వారి పరాక్రమం, త్యాగాలు, పోరాటాలకు దక్కాల్సిన గౌరవం అప్పట్లో అందలేదు. నేడు ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో మన ప్రభుత్వం ఆపరేషన్ పవన్‌లో పాల్గొన్న శాంతి పరిరక్షక సైనికుల సహకారాన్ని బహిరంగంగా గుర్తించడమే కాకుండా ప్రతి స్థాయిలోనూ వారి సేవలను గుర్తించే ప్రక్రియలో ఉంది. 2015లో ప్రధాని మోదీ శ్రీలంకను సందర్శించినప్పుడు అక్కడి ఐపీకేఎఫ్ స్మారక చిహ్నం వద్ద భారతీయ సైనికులకు నివాళులర్పించారు. ఇప్పుడు మేం ఢీల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద కూడా ఐపీకేఎఫ్ సైనికులను గుర్తించటంతో పాటు వారికి అర్హమైన గౌరవాన్ని అందిస్తున్నాం." అని ఆయన చెప్పారు.

జాతీయ భద్రత పట్ల నిస్వార్థ సేవ చేసినందుకు.. క్రమశిక్షణ, నాయకత్వం, ధైర్యంతో సమాజానికి మార్గనిర్దేశం చేస్తూ దేశ నిర్మాణానికి సహకరిం చినందుకు.. వివిధ రంగాలలో యువతను తీర్చిదిద్దినందుకు మాజీ సైనికులను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. " మీరు మీ జీవితంలోని బంగారు కాలాన్ని పర్వత శిఖరాలు, మండుతున్న ఇసుక ఎడారులు, తేమతో కూడిన అడవులలో గడుపుతారు. మీరు మరే ఇతర రంగాన్నైనా ఎంచుకుని ఉండొచ్చు. బహుశా ఇన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరం ఉండేది కాదు. మీ కుటుంబాలతో ఎక్కువ సమయం గడపగలిగేవారు. కానీ వీటన్నింటికీ మించి మీరు అన్ని పరిస్థితిలోనూ దృఢంగా నిలబడి దేశాన్ని రక్షించే బాధ్యతను నెరవేరుస్తారు. నిజానికి ఒక సైనికుడు ఎన్నటికీ పదవీ విరమణ చేయడు. యూనిఫాం రంగు మారొచ్చు. పని ప్రదేశం మారొచ్చు. చుట్టూ ఉన్న వ్యక్తులు మారొచ్చు.. కానీ దేశ భక్తి, సేవా స్ఫూర్తి మాత్రం అలాగే ఉంటాయి. మీ సంక్షేమం, శ్రేయస్సు మా నైతిక, భావోద్వేగ బాధ్యత" అని ఆయన వ్యాఖ్యానించారు.

మాజీ సైనికుల సంక్షేమం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సంకల్పంతో ముందుకెళ్తోందన్న ఆయన ఈ దిశగా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. ఒక ర్యాంక్ ఒక పింఛను (ఓఆర్ఓపీ) వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌ను నెరవేర్చడం, మాజీ సైనికుల కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్‌ను (ఈసీహెచ్ఎస్) బలోపేతం చేయడం వంటి వాటిని ఆయన ప్రస్తావించారు.

"ఓఆర్ఓపీ (ఒక ర్యాంక్ ఒక పింఛను) అమలు మాజీ సైనికుల జీవితాల్లో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడమే కాకుండా తమను దేశం న్యాయంగా చూస్తుందనే వారి నమ్మకాన్ని బలపరిచింది. జాతీయ ప్రయోజనాలను కాపాడ టం కోసం జీవితాలను అంకితం చేసిన వారి ఆరోగ్యం విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదనేది మా స్పష్టమైన వైఖరి. ఆరోగ్య సౌకర్యాలు కేవలం నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, మారుమూల ప్రాంతాలకు కూడా చేరేలా చూడాలన్నదే మా ప్రయ త్నం. దూరంగా ఉన్న వైద్యులను సంప్రదించే సదుపాయం టెలిమెడిసిన్ ద్వారా విస్తరిస్తోంది. తద్వా రా అవసరమైన వారికి చికిత్స అందే విషయంలో వయస్సు లేదా దూరం అడ్డంకి కాకూడదు" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

పదవీ విరమణ తర్వాత ప్రారంభమయ్యే సైనికుల జీవితంలోని కొత్త అధ్యాయం గౌరవం, స్వయంప్రతిపత్తితో ఉండేలా చూడాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అని రక్షణ మంత్రి ఉద్ఘాటించారు. మాజీ సైనికుల పునరావాసం, ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. "మాజీ సైనికులకు కొత్త నైపుణ్యాలను నేర్పిస్తున్నాం. ప్రభుత్వ రంగ సంస్థలలో వారికి ప్రాధాన్యత ఇస్తున్నాం.

వారి క్రమశిక్షణ, నాయకత్వం, చిత్తశుద్ధిని ప్రైవేట్ రంగం కూడా గుర్తిస్తోంది. సొంత వ్యాపారాలను ప్రారంభించాలనుకునే మాజీ సైనికులను మేం ప్రోత్సహి స్తున్నాం. గృహ నిర్మాణ పథకాలు, రుణ సదుపాయాలు, ఇతర సంక్షేమ పథకాలు.. ఇలా ఏవైనా సరే అవన్నీ మాజీ సైనికుల అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నాం'' అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన సైనికులకు ప్రభుత్వం తగిన గౌరవం ఇస్తోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మాతృభూమి సేవలో ప్రాణాలు అర్పించిన వీర జవానులను దేశంలోని ప్రతి ఒక్కరికి గుర్తు చేసేలా 'జాతీయ యుద్ధ స్మారకం' వంటి ప్రతిష్ఠా త్మక కట్టడాలను నిర్మించినట్లు ఆయన తెలిపారు. "భవిష్యత్తు తరాల మనస్సులో గౌరవం, కృతజ్ఞతా భావం నిలిచి ఉండేలా చూసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థానిక స్థాయిలో ఇటువంటి స్మారక చిహ్నాలను ప్రోత్సహిస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఒక దేశం నిజమైన బలాన్ని కేవలం పథకాల ద్వారా మాత్రమే కొలవలేమన్న రక్షణ మంత్రి.. ఇది తన సైనికులను, మాజీ సైనికులను చూసే సామాజిక చైతన్యంలో ప్రతిబింబిస్తుందని ప్రధానంగా చెప్పారు. "మన సమాజం మాజీ సైనికులకు ఇచ్చే గౌరవం మనకు ఒక గొప్ప సామాజిక మూలధనం. ఇది తరతరాలను అనుసంధానిస్తుంది.. దేశం ఆత్మను బలపరుస్తుంది. భారత్‌లో సైనికుల పట్ల ఉండే గౌరవం ప్రభుత్వ ఆదేశం నుంచి కాకుండా మన విలువల సహజ విస్తరణలో భాగంగా వచ్చాయని చెప్పుకోవడం మనకు గర్వకారణం. సైనికులతో మనకున్న బంధం హృదయపూర్వకమైనది.. నమ్మకంతో కూడినది.. గౌరవప్రదమైనది.. ఉమ్మడి భవిష్యత్తు కలలతో ముడిపడి ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ సైనికుల సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి సుకృతి లిఖి.. మాజీ సైనికులు, వారి కుటుంబాల అజేయమైన స్ఫూర్తికి వందనం చేస్తున్నట్లు తెలిపారు. పూర్వ సైనికుల దినోత్సవం అనేది కేవలం ఒక ఉత్సవ కార్యక్రమం మాత్రమే కాదని దేశ సామూహిక చైతన్యాన్ని పునరుజ్జీవింపజేసే రోజని ఆమె అభివర్ణించారు. "సైనిక జీవితం ముగిసిన తర్వాత కూడా దేశానికి, దాని సైనికులకు మధ్య ఉండే బంధం ఎప్పటికీ శాశ్వతంగా నిలిచి ఉంటుందని ఈ రోజు మనకు గుర్తు చేస్తుంది" అని ఆమె చెప్పారు.

ప్రతి సంవత్సరం సుమారు 60,000 మంది సైనికులు పదవీ విరమణ పొందుతున్నారన్న మాజీ సైనికుల సంక్షేమ శాఖ కార్యదర్శి.. దీనివల్ల ప్రస్తుతం సుమారు 35 లక్షల మంది మాజీ సైనికులు ఉన్నారని తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమం అనేది దేశం నెరవేర్చవలసిన భారీ బాధ్యత అన్న విషయాన్ని ఇది తెలియజేస్తోందని ఆమె అన్నారు.

మాజీ సైనికులు తమతో పాటు అపారమైన అనుభవం, నాయకత్వ లక్షణాలు, లోతైన విధి నిర్వహణ పట్ల నిబద్ధతను తీసుకువస్తారని.. వారు తమ జీవితాలను గౌరవం, ఆత్మగౌరవంతో గడిపేలా చూడటం అనేది దేశానికి ఉన్న సామూహిక బాధ్యత అని ఆమె ప్రముఖంగా చెప్పారు.

మాజీ సైనికులకు సకాలంలో సేవలు అందించే విషయంలో మాజీ సైనికుల సంక్షేమ శాఖ (డీఈఎస్‌డబ్ల్యూ) నిబద్ధతతో ఉన్నట్లు శ్రీమతి సుకృతి లిఖి తెలియజేశారు. వారి సేవ, త్యాగం, గౌరవమే తమ విధానాలకు పునాది అని ఆమె పేర్కొన్నారు. "మాజీ సైనికులు, వారిపై ఆధారపడిన వారికి అండగా నిలవడంలో మా శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. గత కొన్ని సంవత్సరాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు అనేక పటిష్ఠమైన చర్యలు తీసుకున్నాం. వీటిలో సకాలంలో పింఛను పంపిణీ చేయటంలో మెరుగుదల, కేంద్రీయ సైనిక్ బోర్డు (కేఎస్‌బీ) నుంచి పెరిగిన గ్రాంట్లు, డీజీఆర్ పునరావాస-శిక్షణ కోర్సుల విస్తరణ వంటివి ఉన్నాయి. అదే సమయంలో ప్రస్తుతం ఈసీహెచ్ఎస్ ద్వారా 64 లక్షల మంది లబ్ధిదారులకు వైద్య సేవలు అందుతున్నాయి" అని ఆమె వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, నావికాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి, వాయుసేన అధిపతి ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్, చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్, వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్, మాజీ దళాధిపతులు, ఇతర సైనికులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇండియన్ ఆర్మీ వెటరన్స్ డైరెక్టరేట్ ప్రచురించిన 'సమ్మాన్', నావల్ వెటరన్స్ డైరెక్టరేట్ ప్రచురించిన 'సాగర్ సంవాద్', ఎయిర్ వెటరన్స్ డైరెక్టరేట్ ప్రచురించిన 'వాయు సంవేదన' అనే వార్షిక మ్యాగజైన్‌లను విడుదల చేశారు.

మాజీ సైనికుల నిస్వార్థ విధి నిర్వహణ, దేశ సేవ, త్యాగానికి గౌరవ సూచికంగా రాజౌరీ, అమృత్‌సర్, లక్నో, రాంచీ, గౌహతి, పుణె, గోవా, కొచ్చితో సహా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మాజీ సైనికుల ర్యాలీలు, పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించే కార్యక్రమాలను కూడా నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ముప్పై నాలుగు (34) రాజ్య సైనిక్ బోర్డులు, 434 జిల్లా సైనిక బోర్డులు ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలను నిర్వహించాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్యక్రమాల వేదికల వద్ద తక్షణ ఫిర్యాదుల పరిష్కారం, పిర్యాదుల పరిష్కారాన్ని సలభతరం చేసే ఏర్పాట్లతో పాటు అవగాహన కోసం మూడు రక్షణ దళాలు, రక్షణ- ప్రభుత్వ సంక్షేమ సంస్థలు, బ్యాంకులు, ఉపాధి సంస్థలు హెల్ప్ డెస్క్‌లు, స్టాళ్లు ఏర్పాటు చేశాయి.

1953లో ఇదే రోజున పదవీ విరమణ చేసిన భారత సైన్యపు మొట్టమొదటి కమాండర్-ఇన్-చీఫ్, ఫీల్డ్ మార్షల్ కేఎం కరియప్ప వారసత్వాన్ని, ఆయన చేసిన అద్భుతమైన సేవలను గౌరవించడానికి ప్రతి సంవత్సరం జనవరి 14న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

ఎల్ వోసీ అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి

ఆదిలాబాద్, జనవరి 16:ఊట్నూర్ మండల పరిధిలోని త్రిప్రాస్ పల్లి గ్రామానికి చెందిన కుర్వ పూజారి శరణప్ప గుండె ఆపరేషన్ కు రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి బాధితుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎల్ వోసీ అందజేశారు. శరణప్ప గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆపరేషన్ కోసం రూ. 6 లక్షల ఎల్ వోసీ అందజేసి ఆపదలో నేనున్నానంటూ మంత్రి భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యజ్ఞేశ్వర్ రెడ్డి, ఓబులాపూర్ మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు నరసింహ, ఆంజనేయులు, ఉషప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

చట్టవిరుద్ధంగా వాకీ-టాకీల విక్రయం..

13 ఈ-కామర్స్ సైట్స్‌కు రూ.10 లక్షల చొప్పున జరిమానా

న్యూఢిల్లీ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: చట్టవిరుద్ధంగా వాకీ-టాకీలు విక్రయిస్తున్న ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై కేంద్ర వినియోగదారుల రక్షణ అథారిటీ (సీసీపీఏ) స్వయంగా చర్యలు చేపట్టింది. 13 ప్రముఖ ఈ-కామర్స్ సైట్స్‌కు రూ.10 లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో, మీషో, మాస్క్‌మ్యాన్ టాయ్స్, ట్రేడ్ ఇండియా, ఆంత్రిక్ష్ టెక్నాలజీస్, వర్ధాన్‌మార్ట్, ఇండియామార్ట్, మెటా ప్లాట్‌ఫామ్‌లు ఇంక్. (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), ఫ్లిప్‌కార్ట్, కృష్ణ మార్ట్, అమెజాన్ సంస్థలు 16,970కు పైగా చట్టవిరుద్ధంగా వాకీ-టాకీలు అమ్మినట్లు సీసీపీఏ గుర్తించింది. ఆయా ఈ-కామర్స్ సంస్థలు వినియోగదారుల రక్షణ చట్టం 2019, టెలికాం చట్టాలను ఉల్లంఘించినట్లు సీసీపీఏ ఆరోపించింది. ఎనిమిది సంస్థలకు తుది ఉత్తర్వులు జారీ చేసింది. వాటికి రూ.44 లక్షల జరిమానాలు విధించిందికాగా, మీషో, మెటా ప్లాట్‌ఫార్మ్స్ ఇంక్. (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లపై రూ.10 లక్షల చొప్పున, చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్‌లపై లక్ష చొప్పున జరిమానా విధించినట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. మీషో, మెటా, చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో సంస్థలు జరిమానా చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన ప్లాట్‌ఫామ్‌ల నుంచి జరిమానా చెల్లింపులు రావాల్సి ఉన్నదని వెల్లడించారు.

ఎట్టకేలకు నోబెల్ శాంతి బహుమతి అందుకున్న ట్రంప్..!

న్యూ ఢిల్లీ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);నోబెల్ శాంతి పురస్కారం అందుకోవాలన్న ట్రంప్ కల ఎట్టకేలకు నెరవేరింది. గురువారం నాడు ఆ పురస్కారాన్ని అందుకున్నారు. అయితే ఇక్కడే ఒక ట్విస్ట్ ఉంది. అది ఆయనకు నోబెల్ కమిటీ ఇచ్చిన అవార్డు కాదు.. వెనెజువెలా విపక్ష నేత మారియా కొరీనా మచాడో ఇచ్చింది. తాను అందుకున్న నోబెల్ శాంతి బహుమతిని ఆమె ట్రంప్‌నకు ఇచ్చేశారు. గురువారం ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో భేటీ అయిన సమయంలో నోబెల్ శాంతి పురస్కారాన్ని ట్రంప్‌కు ఆమె అందజేశారు. సమావేశం అనంతరం ఈ విషయాన్ని మచాడోనే స్వయంగా వెల్లడించారు.నోబెల్ శాంతి పురస్కారం అందుకోవడానికి తాను అర్హుడిని అని డోనాల్డ్ ట్రంప్ గతంలో పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. మచాడో నోబెల్ పురస్కారం గెలుచుకున్నప్పుడు కూడా ఆమె నాయకత్వ సామర్థ్యంపై ట్రంప్ సందేహాలు వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడికి నేను నోబెల్ శాంతి పురస్కారాన్ని అందజేశానని తెలిపారు. ఈ సందర్భంగా చారిత్రక ఘటనను ఉదాహరించారు. అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఫ్రెంచ్ సైనికాధికారి మార్క్విస్ డి లాఫాయెట్.. వెనెజువెలా విమోచకుడు సిమోన్ బొలివార్‌కు పతకం అందజేశారని గుర్తుచేశారు. రెండు శతాబ్దాల తర్వాత ఇప్పుడు బొలివార్ ప్రజలు వాషింగ్టన్ వారసుడిగా భావించే వ్యక్తికి ఈ పురస్కారాన్ని తిరిగి అందజేస్తున్నారని వ్యాఖ్యానించారు. వెనెజువెలా ప్రజల సంక్షేమం కోసం ట్రంప్ చేస్తున్న కృషికి గుర్తుగా తనకు వచ్చిన నోబెల్ శాంతి పురస్కారాన్ని అందజేశానని మచాడో తెలిపారు.

వెనెజువెలా ప్రజల స్వేచ్ఛ సాధన కోసం ట్రంప్ చేస్తున్న కృషిపై తమకు విశ్వాసం ఉందని తెలిపారు. వెనెజు వెలా ప్రజలు ఎదుర్కొంటున్న బాధలను ఆయన అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆ పురస్కారాన్ని ట్రంప్ తన వద్దే ఉంచుకున్నారా.. లేదా అన్న విషయంపై మాత్రం ఆమె స్పష్టత ఇవ్వలేదు. అయితే నిబంధనలకు ప్రకారం ఒకరికి అందజేసిన పురస్కారాన్ని మరొకరికి బదిలీ చేయడం, ఇతరులతో పంచుకోవడం కుదరదని గతంలోనే నోబెల్ కమిటీ ఇప్పటికే స్పష్టం చేసింది. విజేత పేరు శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొంది.

సంపత్ అక్రమాలపై విచారణ జరిపే దమ్ముందా..

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఏఐసీసీ నేత సంపత్ కుమార్ ప్రెస్‌మీట్లు పెట్టి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. సంపత్ కుమార్ చేసింది మొత్తం మట్టి దందాలే అని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీ భ్రమర కాంట్రాక్టర్లును బెదిరించి రూ.8 కోట్లు డిమాండ్ చేశారని తెలిపారు. దీనిపై శ్రీ భ్రమర కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేశారని.. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు.మారణాయుధాలతో తమను బెదిరించారని శ్రీభ్రమర కాంట్రాక్టర్లు ఫిర్యాదులో పేర్కొన్నారని మన్నె క్రిశాంక్ తెలిపారు. కాంట్రాక్టులు రావాలంటే రూ.8కోట్లు ఇచ్చుకోవాలని బెదిరించారని తమ ఫిర్యాదులో వివరించారని పేర్కొన్నారు. సంపత్ అక్రమాలపై వెంటనే సిట్ విచారణ ప్రకటించాలని రేవంత్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో సంపత్ కుమార్ అన్నీ తప్పులే సమర్పించారని తెలిపారు. భూముల వివరాలపై తప్పుడు అఫిడవిట్ సమర్పించారని పేర్కొన్నారు. అసైన్డ్ భూములను సంపత్ కుమార్ తన సతీమణిపై రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిపారు. సంపత్ కుమార్ అబ్బాయి అక్రమ కంపెనీ గ్లోబెన్ ఇండస్ట్రీస్‌కి డైరెక్టర్గా ఉన్నాడని అన్నారు. అక్రమ కంపెనీలతో కాంట్రాక్టులు దక్కించుకుంటున్నారని ఆరోపించారు. గ్లోబెన్ ఇండస్ట్రీస్‌కే అన్ని కాంట్రాక్టులు ఎందుకు వెళ్తున్నాయని ప్రశ్నించారు.మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా అక్రమాలకే పాల్పడుతున్నారని క్రిశాంక్ తెలిపారు. వంద పడకల ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు. మీడియా చానళ్లపై వేసిన సిట్‌లో సజ్జనార్‌ను పెడతారా? ఇంకో అధికారిని పెడతారా అని ప్రశ్నించారు. ఆ సిట్‌కు సంపత్ కుమార్ బెదిరింపు ఆడియో టేప్‌లను అందజేస్తామని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల వివరాలను వెబ్‌సైట్లలో ఎందుకు పెట్టడం లేదని క్రిశాంక్ ప్రశ్నించారు. సంపత్ కుమార్ ఓకే అంటేనే కాంట్రాక్టు ఉద్యోగాలు ఇస్తున్నారని అన్నారు. ఉద్యోగాల లిస్ట్ ఎందుకు సంపత్ కుమార్ దగ్గరకు వెళ్తుందని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగ యువత సంపత్ కుమార్ అక్రమాలపై ఆలోచించాలని సూచించారు. సంపత్ కుమార్ క్విడ్ ప్రోకోలపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇసుక, మట్టి దందాలపై విచారణ జరగాలన్నారు. సంపత్ కుమార్‌పై విచారణ జరిపించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని అడిగారు. సంపత్ కుమార్ అక్రమాలపై విచారణకు రేవంత్ రెడ్డి రెడీనా అని సవాలు విసిరారు.

క్రీడలతో మానసికోల్లాసం..శారీరక దృఢత్వం : చైర్మన్ కోట్నాక

ఆదిలాబాద్, జనవరి 16:క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, గ్రామీణ యువత ప్రతిభ చాటేందుకు క్రీడలు దోహదం చేస్తాయని తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కంది సతీష్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీ బాల్ పోటీలను ప్రారంభించారు.

గెలుపొందిన తాళ్లపేట జట్టుకు రూ. 10 వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ గా నిలిచిన లక్షెట్టిపేట జట్టుకు రూ.5 వేల నగదు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడడం వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. గెలుపుతో మురిసిపోకుండా, ఓటమితో కృంగిపోకుండా జీవితంలో రాణించడం నేర్చుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీపీలు జాబు కాంతారావు, గురువయ్య, అక్కల వెంకటేశ్వర్లు, సర్పంచులు పెంట నత్తయ్య, చిలుకూరి మహేష్, శంకరవ్వ, మాజీ ఎంపిటిసిలు కంది నతీష్ హేమలత, ముత్యాల శ్రీనివాస్, బొడ్డు కమలాకర్, వనపర్తి రవి, ఉపసర్పంచ్ ఫయాజ్, తిరుపతి నాయక్, స్థానిక నాయకులు అడాయి కాంతారావు, కన్నాక జంగు, సందేల తిరుపతి, శ్రీధర్, నలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహనలో ప్రభుత్వ ఉద్యోగులే ముందుండాలి

కరీంనగర్, జనవరి 16: ట్రాఫిక్ నిబంధనలు తాము పాటించడమే కాకుండా, ఇతరులు కూడా తప్పనిసరిగా అనుసరించేలా ప్రజల్లో అవగాహన కల్పించడంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రధాన పాత్ర పోషించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. "ఎరైవ్-అలైవ్ క్యాంపెయిన్"లో భాగంగా గోదా వరిఖని పోలీసుల ఆధ్వర్యంలో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా భావించి ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

సమాజంలో గౌరవ స్థానంలో ఉన్న ఉద్యోగులు తమ భద్రత, రక్షణపై సరైన ఆలోచనలను ప్రజలకు వివరించినప్పుడు ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. నగరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమన్వయంతో నగర పాలక సంస్థ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అన్ని ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు సమష్టిగా కృషి చేస్తేనే ప్రమాదాల నియంత్రణ సాధ్యమని ఆయన అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ రోడ్డు ప్రమా దాల నివారణకు రోడ్డు వెడల్పు పెంపుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను నగర పాలక సంస్థ అమలు చేస్తున్నట్లు తెలిపా రు. జిల్లా కేంద్రంలో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాలు తరచుగా నిర్వహిస్తూ, వాటి సూచనలను కార్యాచరణలో పెట్టుతున్నామని చెప్పారు. పోలీస్ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను నగర పాలక సంస్థ స్వీకరిస్తోందని, టైమ్ మేనేజ్‌మెంట్ పాటిస్తే ప్రమాదాలు కొంతవరకు నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ దిశగా నగర పాలక సంస్థ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ.. "ఎరైవ్-అలైవ్ క్యాంపెయిన్" ఉద్దేశ్యాన్ని వివరించడంతో పాటు, రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాలు ఎదుర్కొనే బాధలను తెలియజేశారు. ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను సత్వరంగా ఆసుపత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి కాపాడితే ప్రభుత్వం నగదు పురస్కారం అందిస్తోందని, అలాగే బాధితులకు రూ.1.50 లక్షల విలువైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆర్ఎంఓ కృపా భాయ్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, రవాణా శాఖ అధికారి లింగయ్య, ఆర్ అండ్ బి, ఆర్టీసీ, మున్సిపల్ తదితర ప్రభుత్వ సంస్థల అధికారులు, సిబ్బంది, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అదుపు తప్పి పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

కావలి జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);గూడ్స్ రైలు అదుపు తప్పి పట్టాలు తప్పిన సంఘటన ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లా కావలి రైల్వే స్టేషన్ యార్డ్ వద్ద చోటు చేసుకుంది. గూడ్స్ రైలు నిజామాబాద్ నుంచి రేణిగుంటకు వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున రెండు పాల ట్యాంకర్ బోగీలు పక్కకు జరిగాయి. వెంటనే రైల్వే సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

మత్తులో మూడంతస్తుల భవనం పైనుంచి అన్నను తోసేసిన తమ్ముడు

-స్థానికులు ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన అన్న

హైదరాబాద్ జనవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మత్తులో ఎంత దారుణానికైనా ఒడిగడతారు. అలాంటి దారుణమైన ఘటనే నగరంలో చోటు చేసుకుంది. మద్యం గ్లాస్ కోసం అన్నను తమ్ముడు చంపిన ఘటన నాచారం పిఎస్ పరిధిలో జరిగింది. అర్ధరాత్రి మద్యం తాగే క్రమంలో గ్లాస్ గురించి అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. దీంతో మూడంతస్తుల భవనం పైనుంచి అన్నను తమ్ముడు తోసేశాడు. ఇది గమనించిన స్థానికులు అన్నను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కానీ, మార్గమధ్యంలోనే అతడు ప్రాణాలు కోల్పోయాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం అని చెబుతున్నా.. చాలా మంది ఆ విషయాన్ని పెడచెవిన పెడుతుంటారు. ముఖ్యంగా కొందరు మద్యం సేవించి ఎలా ప్రవర్తిస్తారో వారికే తెలియదు.

జైపూర్‌లో ఘనంగా 78వ సైనిక దినోత్సవాన్ని నిర్వహించిన భారత సైన్యం

న్యూఢిల్లీ, జనవరి 16:రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2026 జనవరి 15న 78వ సైనిక దినోత్సవం వేడుకలను భారత సైన్యం ఘనంగా నిర్వహించింది. జైపూర్ కంటోన్మెంట్‌లోని 'ప్రేరణా స్థల్' వద్ద పుష్పగుచ్ఛం ఉంచిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ (సీఏఓఎస్) జనరల్ ఉపేంద్ర ద్వివేది.. దేశం కోసం అత్యుతున్నత త్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. దీనితోనే కవాతు ప్రారంభమైంది. భారత వైమానిక దళం, నౌకాదళం తరపున ఎయిర్ వైస్ మార్షల్ ఎం. బందోపాధ్యాయ, కమోడోర్ పీ. వర్మ కూడా అమరవీరులకు నివాళులర్పించారు.

దేశంలోని ఇతర ప్రాంతాల్లో సైనిక దినోత్సవ వేడుకలు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం తర్వాత ఢిల్లీ వెలుపల దీనిని నిర్వహించటం ఇది నాలుగోసారి. మొట్టమొదటిసారిగా ఈ కవాతును ఆర్మీ కంటోన్మెంట్ వెలుపల చేపట్టారు. జైపూర్ నగర నడిబొడ్డున ఉన్న మహల్ రోడ్‌లో అక్షయ పాత్ర సర్కిల్ నుంచి ప్రారంభమైన కవాతు బాంబే ఆస్పత్రి వరకు కొనసాగింది. 2023 నుంచి బెంగళూరు, లక్నో, పుణెలలో ఈ కవాతును నిర్వహించారు. నైరుతి కమాండ్ మొదటిసారిగా ఈ కవాతుకు ఆతిథ్యం ఇచ్చింది.

సమీక్షాధికారిగా ఉన్న జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ అద్భుతమైన కవాతు సందర్భంగా సైనిక వందనం అందుకున్నారు. జైపూర్‌లోని మహల్ రోడ్‌లో జరిగిన ఈ కార్యక్రమం ఒక మంచి వేడుకతో ప్రారంభమైంది. ఇందులో దేశం కోసం ప్రాణాలర్పించిన ఐదుగురు వీర జవాన్ల కుటుంబ సభ్యులకు సైనికాధిపతి 'సేనా మెడల్' (మరణానంతరం) ప్రదానం చేశారు.

ఉత్సాహంతో కూడిన లక్షకు పైగా ప్రేక్షకులు ఈ సైనిక దినోత్సవం కవాతును వీక్షించారు. వారి ఉద్వేగభరితమైన భాగస్వామ్యం భారత సైన్యానికి, ప్రజలకు మధ్య ఉన్న బలమైన నమ్మకం, గర్వాన్ని తెలియజేసింది. ప్రేక్షకుల భారీ స్పందన ఈ వేడుకలకు అపారమైన బలాన్ని ఇవ్వటమే కాకుండా సైనికుల పట్ల దేశానికి ఉన్న తిరుగులేని మద్దతును పునరుద్ఘాటించింది. భవిష్యత్తు యుద్ధ క్షేత్రం కోసం సైన్యం ఉపయోగిస్తున్న తదుపరి తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ కవాతు ప్రదర్శించింది. సాంకేతిక పురోగతి ద్వారా దేశాన్ని రక్షించడంలో సంసిద్ధతను నిర్ధారిస్తూ స్వదేశీ పరిష్కారాలను వినియోగించుకోవడం, ప్రపంచ సైనిక పోకడల కంటే ముందుండటం సైన్యం నిరంతరం దృష్టి సారించటాన్ని ఇది ప్రధానంగా తెలియజేసింది.

మద్రాస్ రెజిమెంటల్ సెంటర్, రాజపుత్ రెజిమెంటల్ సెంటర్, రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీ, మిక్స్‌డ్ స్కౌట్స్, ఎన్‌సీసీ మహిళా కాంటింజెంట్‌లతో సహా ఏడు విశిష్ట మార్చింగ్ బృందాలతో 30కి పైగా విభాగాలు ఈ అద్భుతమైన మార్చ్-పాస్ట్‌లో పాల్గొన్నాయి. ఈ కవాతులో మొట్టమొదటిసారిగా 'రాజ్‌రిఫ్', 'సిక్కు ఎల్ఐ' నుంచి రెండు ప్రత్యేక 'భైరవ్ బెటాలియన్' బృందాలు పాల్గొన్నాయి. సరిహద్దుల్లో వేగవంతమైన, తీవ్ర ప్రభావం చూపే ఆపరేషన్ల కోసం రూపొం దించిన ఆధునిక, చురుకైన, ప్రాణాంతక యుద్ధ సామర్థ్యాల దిశగా మారుతున్న భారత సైన్యం వ్యూహాత్మక ధోరణికి చిహ్నంగా ఇవి నిలిచాయి. ఆధునిక యుద్ధభూమిలో 'తెలివిగా పోరాడటం, వేగంగా దాడి చేయడం' అనే భారత్ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తూ ఈ భైరవ్ బెటాలియన్లు ఒక 'పరిమిత సంఖ్యలో ఉండి అత్యంత శక్తిమంతంగా పనిచేసే' దళంగా నిలిచాయి. ఎల్‌సీహెచ్, ఏఎల్‌హెచ్, డబ్ల్యూఎస్ఐ, అపాచీ వంటి ఆర్మీ హెలికాప్టర్ల వైమానిక విన్యాసాలు ఈ కవాతు వైభవాన్ని మరింత పెంచాయి.

రెండు సైన్యాల మధ్య ఉన్న లోతైన స్నేహం, పరస్పర నమ్మకం, ఉమ్మడి సైనిక సంప్రదాయాలను తెలియజేస్తూ నేపాల్ ఆర్మీ బ్యాండ్ కూడా ఈ కవాతులో పాల్గొంది. వారి భాగస్వామ్యం చిరకాల సాంస్కృతిక సంబంధాలు, సన్నిహిత సహకారాన్ని తెలియజేయటమే కాకుండా భారత్-నేపాల్ రక్షణ సంబంధాలను బలోపేతం చేసే సౌభ్రాతృత్వం, భాగస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పింది. సైనిక దినోత్సవం కవాతులో ఏడు సైనిక బ్యాండ్‌ల అద్భుత ప్రదర్శనలు ఉన్నాయి. ఈ సైనిక బ్యాండ్‌లలో సిక్కు రెజిమెంటల్ సెంటర్, డోగ్రా రెజిమెంటల్ సెంటర్, మరాఠా ఎల్ఐ రెజిమెంటల్ సెంటర్, బీఈజీ సెంటర్, ఆర్టిలరీ రెజిమెంటల్ సెంటర్, ఈఎంఈ సెంటర్, ఎన్‌సీసీ పురుషులు- మహిళల మిక్స్‌డ్ బృందాలు ఉన్నాయి.

భారత సైన్యం సాధిస్తున్న పురోగతి, ఆధునిక యుద్ధ తంత్ర సంసిద్ధతను చాటి చెబుతూ 78వ సైనిక దినోత్సవ కవాతులో వాహనాలపై అమర్చిన భారీ ఆయుధాలు, పరికరాలు, అత్యాధునిక సాంకేతికతల అద్భుత ప్రదర్శన కనువిందు చేసింది. దేశ రక్షణ విషయంలో భారత సైన్యాన్ని శక్తిమంతం చేసే అధునాతన ఆయుధాలు, సైనిక సాంకేతికతను ప్రత్యక్షంగా వీక్షించే అరుదైన అవకాశం ఈ ప్రదర్శన ద్వారా ప్రజలకు లభించింది. టీ-90 ట్యాంకులు, బీఎంపీ-2, అర్జున్ ట్యాంకులు వంటి భారీ యుద్ధ వాహనాలతో పాటు స్మెర్చ్, కే-9 వజ్ర, గ్రాడ్ బీఎం రాకెట్లు, ధనుష్, ఏటీఏజీఎస్, దివ్యాస్త్ర, యూఎల్ఆర్ఎస్ వంటి శక్తిమంతమైన ఆయుధాలను కలిగి ఉన్న సైన్యం పోరాట పటిమను ఈ కవాతు ప్రదర్శించింది. వీటితో పాటు నవీకరించిన షిల్కా, శక్తిబాన్ వంటి వాయు రక్షణ, దళాల రక్షణ సామర్థ్యాలను కూడా ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. అన్ని ఉపరితలాలలపై నడిచే వాహనాలు, రోబోటిక్ మ్యూల్స్‌తో సైన్యానికి ఉన్న కదలిక వేగం-స్వయంప్రతిపత్తిని.. వాహన ఆధారిత ఇన్‌ఫాంట్రీ మోర్టార్ వ్యవస్థల ద్వారా వేగవంతమైన ఎదురుదాడి సామర్థ్యాన్ని ఇది ప్రముఖంగా చూపించింది. లక్ష్యాలను ఖచ్చితత్వంతో ఛేదించే మిలాన్ క్షిపణి లాంచర్లు వంటి ఆయుధాలు.. ప్రబల్ సీ-యూఏఎస్ (వాహనాలపై ఉండే, మానవుల కదిలించ గలిగే), గాలిలో లక్ష్యాలను ఛేదించగలిగే వ్యవస్థలు, డ్రోన్ జామింగ్, స్పూఫర్ వ్యవస్థలతో కూడిన తదుపరి తరం మానవరహిత సామర్థ్యాలను భైరవ్ బెటాలియన్లతో సహా ప్రదర్శించారు. భారీ వాహనాలపై అమర్చిన ఇతర డ్రోన్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు స్విచ్ యూఏవీ, సంజయ్, ప్రళయ్, బాజ్ వంటి సాయుధ డ్రోన్లతో కూడిన ఆర్‌పీఏలు ఈ ప్రదర్శనలో భాగమయ్యాయి. ఆపరేషన్ సింధూర్‌లో ఉపయోగించిన బ్రహ్మోస్, పినాక, యూఎల్‌హెచ్ ఎం777, ఆకాష్ ఆయుధ వ్యవస్థ, మధ్యస్థ స్థాయి ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు, ఎల్-70 తుపాకులు, ప్రత్యేక మొబిలిటీ వాహనాలు (ఎస్ఎంవీ), క్విక్ రియాక్షన్ ఫోర్స్ వాహనాలు కూడా కవాతులో పాల్గొని ఆపరేషనల్ ప్రాముఖ్యతను చాటాయి.

అత్యున్నత నైపుణ్యం, బృంద స్ఫూర్తి, నియంత్రణను తెలియజేస్తూ సైనిక రైడర్లు నిర్వహించిన ద్విచక్రవాహనాల ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సైనికుల ఖచ్చితమైన విన్యాసాలు, క్రమశిక్షణతో కూడిన ఫార్మేషన్ల అబ్బురపరిచాయి. భద్రతా విధులు, సెర్చ్ ఆపరేషన్లు, మిషన్ మద్దతులో కీలక పాత్రను తెలియజేసేలా శిక్షణ పొందిన కుక్కలు విధేయత, కార్యాచరణ డ్రిల్స్‌తో కూడిన ఆర్మీ కెనైన్ ప్రదర్శన ఈ కార్యక్రమానికి మరింత శోభను తీసుకొచ్చింది.

ఆపరేషన్ సింధూర్, సైన్యం 'దశాబ్దపు పరివర్తన' కార్యక్రమాలు, నూతన తరం పరికరాల శ్రేణిని ప్రముఖంగా ప్రదర్శిస్తూ సాంకేతికతను అందిపుచ్చుకోవడం, దేశ నిర్మాణంలో భారత సైన్యం పోషిస్తోన్న పాత్రను ఈ కవాతులోని ఇతివృత్తాంత శకటాలు ప్రముఖంగా తెలియజేశాయి. రాజస్థాన్ ప్రభుత్వ పక్షాన లలిత కళా అకాడమీ సమర్పించిన రెండో శకటం రాజస్థాన్ సాంస్కృతిక వారసత్వం, అద్భుతమైన ప్రాకృతిక దృశ్యాలను ప్రదర్శించింది.

భారతదేశపు వైవిధ్యభరితమైన వారసత్వం, ప్రజలతో సైన్యానికి ఉన్న బలమైన బంధాన్ని తెలియజేస్తూ రాజస్థాన్ కళాకారులు ప్రదర్శించిన కల్బేలియా, గైర్ జానపద నృత్యాలతో పాటు మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన చెండ సాంస్కృతిక బృందం చేసిన అద్భుత ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ ప్రదర్శనలు పండుగ వాతావరణాన్ని తీసుకురావడమే కాకుండా ఉత్సవాలకు గొప్ప ప్రాంతీయ శోభను అద్దాయి.

జైపూర్ సైనిక దినోత్సవ వేడుకల్లో మాట్లాడిన ఆర్మీ చీఫ్.. సైన్యానికి, ప్రజలకు మధ్య ఉన్న బలమైన బంధాన్ని గుర్తుచేశారు. దేశ సేవలో ప్రాణాలర్పించిన సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాలను ఆయన గౌరవించారు. ఉద్భవిస్తున్న సవాళ్లకు అనుగుణంగా రూపొందించిన కొత్త వ్యవస్థలు, యూనిట్లతో భారత సైన్యం చురుకైన (ఏజిలిటీ) సాంకేతికత, స్వయంప్రతిపత్తితో కూడిన 'భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న' దళంగా మారుతోందని ఆయన ప్రధానంగా చెప్పారు. ఆత్మనిర్భరతను గురించి మాట్లాడిన ఆయన.. స్వదేశీకరణ అనేది ఇప్పుడు ఒక వ్యూహాత్మక అవసరమని పేర్కొన్నారు. దీనికి నిదర్శనంగా 'భారత్‌లో తయారీ' ఆయుధ వ్యవస్థలు, పరికరాలను ఇక్కడ ప్రదర్శించినట్లు తెలిపారు. ద్వంద్వ వినియోగ మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలను సైన్యం బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు. సాంకేతికత అనేది సైనికుడిని శక్తిమంతం చేయడానికి మాత్రమే కానీ అతని స్థానాన్ని భర్తీ చేయడానికి కాదని పునరుద్ఘాటించిన ఆయన.. సమాచార ప్రవాహం, నిర్ణయాత్మక ప్రక్రియను మెరుగుపరచడానికి రాబోయే సంవత్సరాల్లో నెట్‌వర్కింగ్, డేటా సెంట్రిసిటీపై దృష్టి సారించనున్నట్లు ప్రకటించారు.

ఈ రోజు సాయంత్రం నిర్వహించబోయే 'శౌర్య సంధ్య' కార్యక్రమానికి భారత రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, సైన్యానికి చెందిన సీనియర్ ప్రముఖులు, ఇతర పౌర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు వీక్షిస్తారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి 'ఫస్ట్ డే కవర్'ను ఆవిష్కరించనున్నారు. దీనితో పాటు అనేక 'నమన్ కేంద్రాలను' వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారు. ఆయన వీరమరణం పొందిన వీరుల కుటుంబ సభ్యులను కూడా సత్కరిస్తారు. శౌర్య సంధ్యలో భాగంగా ఆపరేషన్ సింధూర్‌ను పునరావిష్కరిస్తూ 1,000 డ్రోన్లతో నిర్వహించే అద్భుతమైన ప్రదర్శనతో పాటు సంప్రదాయ యుద్ధ కళలు అయిన కలరిపయట్టు, మల్ఖంబ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

ప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదాలు.. ముగ్గురు మృతి

అమరావతి, జనవరి 16: ఏపీలోని ప్రకాశం జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని కొరిశపాడు మండలం పిచ్చికలగుడిపాడు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో తోట వెంకయ్య(55), వెంకయ్య తల్లి మహాలక్ష్మమ్మ(75) మృతి చెందింది.

ప్రకాశం జిల్లా అద్దంకి బస్టాండ్ ప్రాంగణంలో ప్రమాదవశాత్తు బస్సు కిందపడి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి కోమటిగుంట చెన్న కేశవులు(65) దుర్మరణం చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్రి భాషల్లో తొలి టాకీ చిత్రాల్లో నటించిన ఎల్.వి.ప్రసాద్



–జనవరి 17... ఎల్.వి. ప్రసాద్ జయంతి

భారతీయ సినిమాకి నడకలు నేర్పిన సినీ పరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీ నిర్మాతగా, దర్శకు డుగా, నటుడుగా సినీ నిఘంటువులో తనకంటూ కొన్ని పేజీలు సృష్టిం చుకున్న ఉద్దండుడు. మొట్ట మొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్', తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఎల్ .వి ప్రసాద్ సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయ నతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!?

భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదా సాహేబ్ ఫాల్కే అవార్డును అందు కున్న ఎల్.వి.ప్రసాద్.

ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్ మరియూ భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధిం చారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటంగానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం',' ద్రోహి','సంసారం', 'మిస్సమ్మ', 'అప్పు చేసి పప్పు కూడు' తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు.

ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకాలోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారా బంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉరూరా తిరిగే నాటకా ల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడా రపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తర చూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవాతు. ఇదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటన పై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది.

1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశంలోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి. ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించినందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయ కుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శ కత్వంలో రూపుదిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామా రావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి. ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు.

1931లో ఆలం ఆరా – మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ – మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద – మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు.

మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947),
ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావు కారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు.

జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. వరల్డ్‌లోనే బెస్ట్ ఐ హాస్పిటల్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న ఆయన నెలకొల్పిన 'ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్' దేశంలోనే అత్యున్నత నేత్ర చికిత్సాలయంగా పేరొందింది. ఆయన వారసులు దేశంలోనే అతి పెద్ద ఐమాక్స్ థియేటర్‌ను భాగ్య నగరంలో నిలిపారు..

ఎల్వీ ప్రసాదు స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి

– సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పర్యవేక్షణతో నిధులు
– మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

రాజన్న సిరిసిల్ల, జనవరి 16: నేటినిజం (ప్రతినిధి): భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకొని, భీమేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి, వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రూ. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు.అలాగే మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా రెండు వందల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసి.. రానున్న తరాలకు చరిత్ర తెలిసేలా పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు. ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీన మేడారం జాతర పనులను సీఎం, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తల్లులను దర్శించుకోవాలని కోరారు. రూ.150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ..రూ. 150 కోట్ల నిధులతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు సాగుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కులు చెల్లించుకునే ముందు వేములవాడ కు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఏఎస్పీ రుత్విక్ సాయి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు రాష్ట్రవ్యాప్త అధికారిక సెలవు ప్రకటించాలి

–మంత్రి సీతక్కకు వినతి

వేములవాడ, జనవరి 16: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అధికారిక సెలవు ప్రకటించాలని కోరుతూ ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్కకు భక్తులు మరియు వివిధ సంఘాల ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.ప్రస్తుతం జాతర సమయంలో కేవలం ఉమ్మడి వరంగల్ జిల్లాకు లేదా స్థానికంగా మాత్రమే సెలవు ఇస్తున్నారనీ, దీనివల్ల రాష్ట్రంలోని ఇతర జిల్లాల ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు అమ్మవార్లను దర్శించుకునే వీలు కలగడం లేదన్నారు.తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన ఈ జాతర ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా జాతర సమయంలో రాష్ట్రవ్యాప్త అధికారిక సెలవు ఇవ్వాలని కోరారు.వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన మంత్రి సీతక్క ఈ వినతిపై సానుకూ లంగా స్పందిం చారు. ఈ విషయాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి, కేబినెట్ సమావేశంలో చర్చించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మత సామరస్యం

వేములవాడ, జనవరి 16: వేములవాడలోని తిప్పపూర్ చౌరస్తా సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సిన్నన మత సమరస్యాన్ని చాటుకున్నారు. సమావేశంలో మస్జిద్ నుండి అజాన్ పిలుపు వినపడగానే, ఆది శ్రీనివాస్ తన ప్రసంగాన్ని 2 నిమిషాల పాటు ఆపి, అజాన్ పూర్తివగానే మరలా తన ప్రసం గాన్ని కొనసా గించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిన్నన ప్రజలం దరు కలిసి మెలసి ఉండాలని సభలో చర్చించు కున్నారు. మత సమర స్యం, సహజీవనం వంటి విలువ లను పాటించాలని ఆయ న ప్రజ లను కోసం చేశారు. సమావే శంలో ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కరీంనగర్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

–కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, జనవరి 16: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరంలోని పూలే పార్క్ వద్ద నూతన రోడ్ నిర్మాణానికి భూమి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూతమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కరీంనగర్ అభివృద్ధిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై అడ్డుకున్నాయని అన్నారు.అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదనీ, తమ హయాంలో 350 కోట్ల సీఎం అష్యూరెన్స్ నిధులు, 125 కోట్ల అర్ అండ్ బి నిధులతో మట్టి రోడ్లు లేని నగరంగా కరీంనగర్ లో సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అడ్డుకుందని ఈ సందర్భంగా గంగుల కమలాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కానీ కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి ఒక్క పైసా నిధులు తేవడం లేదని మండి పడ్డారు.తమ హయాంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగించాలని, తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి తప్ప కొత్తగా ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. తమ హయాంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో పాటు, బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మహేష్, ఐలేందర్ యాదవ్, నాంపల్లి శ్రీనివాస్, నక్క కృష్ణ, బోనాల శ్రీకాంత్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవి వర్మ, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మద్దతు ఉన్న వారికే టికెట్లు కేటాయిస్తాం

–మున్సిపల్ పై ఎంఐఎం జెండా ఎగరడమే లక్ష్యంగా శ్రమించాలి
–కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

కరీంనగర్, జనవరి 16: (నేటినిజం ప్రతినిధి) ఎంఐఎం పార్టీలో మున్సిపల్ ఎన్నికల కోలాహలం మొదలైంది. శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుసలాంలో ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఆపార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలోని 40 డివిజన్ల నుంచి మున్సిపల్ ఎన్నికల్లో కార్పొరేటర్ గా ఎంఐఎం తరపున పోటీ చేసే 140మంది ఆశావాహులకు ఎంఐఎం పార్టీ దరఖాస్తు ఫారాలను అందజేశారు.

ఏఐఎంఐఎం దారుసలాం హైదరాబాద్ పేరిట ఏదైనా జాతీయ బ్యాంకులో 3000వేల డీడీతో, దరఖాస్తు ఫారాలను నింపి ఈనెల 20న సాయంత్రం 6 గంటల వరకు ఎంఐఎం పార్టీ కార్యాలయం కరీంనగర్లో అందజేయాలని పేర్కొన్నారు. ప్రజల మద్దతు ఉన్నవారికి గెలుపు గుర్రాలకు ఎంఐఎం పార్టీ టికెట్లు కేటాయిస్తుందన్నారు. ఎవరైనా టికెట్లు ఇప్పిస్తామని మీదగ్గరకు వస్తే ఆశావాహులు నమ్మవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసిన ఫారాలను డిడిలతో సహా పార్టీ హైకమాండ్ కు పంపించడం జరుగుతుందని అనంతరం మూడు రకాల సర్వేలు నిర్వహించి, గెలిచే సత్తా ఉన్న వారిని గుర్తించి, ఫైనల్ గా పార్టీ అధినేత ఆదేశాల మేరకు బీఫారాలను అందజేస్తామన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పై ఎంఐఎం జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కృషి చేయాలని కోరారు. ఒక డివిజన్ నుంచి నలుగురు లేదా ఐదుగురు ఆశావాహులు ఉంటే వారిలో గెలిచే సత్తా ఉన్న నాయకుడికి టికెట్లను కేటాయిస్తామని టికెట్ రాని మిగతా నలుగురు నిరాశ చెందకుండా పార్టీ బలోపేతం కోసం, హై కమాండ్ ఆదేశాలను శిరసావహించి టికెట్ ఇచ్చిన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ నియమాలని ఉల్లంఘించి హైకమాండ్ ఆదేశాలను ధిక్కరిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ నాయకులు బర్కత్ అలీ, సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, అలిబాబా, అజర్ దబీర్, మాజిద్ హుస్సేన్, అరిఫ్ అహ్మద్, అన్నిమల్ల సురేష్, సాజిద్, లింగంపల్లి శ్రీనివాస్, మజారుద్దీన్, వాజిద్ అలీఖాన్, అజీముల్లా ఖాన్, ఫసియుద్దీన్ ఖాలీద్, జమ్మూ ఇష్తియాక్, ఆవేజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు

తుది దశలో మేడారంలో గద్దెల పునర్నిర్మాణ పనులు
భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి
అన్ని వర్గాల సంక్షేమానికి నిధులు
మహిళా సంఘాలకు భవనాలు నిర్మిస్తాము
– పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

రాజన్న సిరిసిల్ల, జనవరి 16: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ వద్ద జంక్షన్ అభివృద్ధి పనులను రూ. కోటితో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి భక్తుల విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణకు రెండు బడ్జెట్ లలో కలిపి రూ. 150 కోట్ల నిధులు మంజూరు చేశారని, సీఎం, ఇతర మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, వివిధ శాఖల నుంచి నిధులు తీసుకు వచ్చి వసతులు కల్పిస్తున్నారని కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేసిన కృషి, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, ఆసక్తితో రాజన్న ఆలయ విస్తరణకు నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. పేదల దేవుడిగా పేరుగాంచిన రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసా గుతున్నాయని వివరించారు. అలాగే సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణ పనులకు రూ. 200 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసారని వెల్లడించారు. వందల ఏండ్లపాటు చరిత్రలో నిలిచేలా..చరిత్ర తెలిసేలా నిర్మాణాలు పూర్తి అవుతున్నాయని వివరించారు. మేడారం జాతరకు ముందు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గుర్తు చేసారు. మేడారం జాతరకు ఇక్కడి భక్తులు రావాలని కోరారు. ఇటు రాజన్న ఆలయ విస్తరణ పనులు, మేడారం గద్దెల పునర్నిర్మాణ పనులు జరుగుతుండడంతో సీఎం రేవంత్ రెడ్డి సంతోషంగా ఉన్నారని వివరించారు. రాజన్న ఆలయ విస్తరణ పనులు పూర్తి అయిన తరువాత వస్తానని తెలిపారు. జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్ల నిధులతో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మిస్తున్నా మని, మండలాల్లో సైతం భవనాలు నిర్మించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. 60 ఏండ్ల వయసు వారు కూడా మహిళా సంఘాల లో చేరవచ్చని వివరించారు. అర్హులైన మహిలం దరూ మహిళా సంఘాల్లో చేరాలని, వడ్డీ లేని రుణాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగో లు కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్ లు, సోలార్ యూనిట్లు, స్వయం ఉపాధి యూనిట్ లు, స్కూల్ యూని ఫారం కుటించే బాధ్యత కూడా అప్పగించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి ఆర్డర్ లు సిరిసిల్లకే కేటాయించామని గుర్తు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బాధ్యులు మిగతా చీరలు త్వరగా ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. మహిళా సంఘాల్లోని సభ్యులు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకుంటే రుణ సహాయం కూడా అందిస్తున్నామని వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటి ఈశ్వరులుగా చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఒకే సంస్కృతి ఉందని, ఈ ప్రాంత అభివృద్ధికి అందరం కలిసి సిఎంను కలుస్తా మని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రెండు లక్షల రుణ మాఫీ ఇలా ఎన్నో పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసున్నదని తెలిపారు. విప్ అడిగిన పనులకు మంత్రి సానుకూలగా స్పందిం చారు .వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి .వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళిక–బద్ధమైన చర్యలు తీసుకుంటు న్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేము లవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతు న్నామని వివరించారు. వేములవాడ పట్టణాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా, టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఇప్పటికే 150 కోట్ల రూపాయలు మంజూరు చేశామని, పనులు జరుగు తున్నా యన్నారు. అలాగే పట్టణంలో సుమారు 47 కోట్ల రూపాయ లతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టామని, 50 సంవత్సరా లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కీలకమైన అభివృద్ధి అని పేర్కొనా న్నరు. పట్టణ సుందరీకరణలో భాగంగా మల్లారం జంక్షన్ నుంచి బతుకమ్మ తెప్ప, బ్రిడ్జి మీదుగా జగిత్యాల బస్ స్టాండ్ (సాయి రక్ష) వరకు మొత్తం 3. 6 కిలో మీటర్ల పరిధిలో 146 విద్యుత్ స్థంబాలతో సుందరీకరణ పనులకు సుమారు 2 కోట్ల 65 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. జంక్షన్ల అభివృద్ధి కోసం తిప్పాపూర్ జంక్షన్ వద్ద కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు విడుదలవుతు న్నాయన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని 28 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, అదనంగా మరిన్ని ప్రాంతాల్లో పనుల కోసం 4 కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. పర్యాటక అభివృద్ధి లక్ష్యంగా టూరిజం శాఖ ద్వారా వేములవాడ గుడి చెరువులో బోటింగ్ సౌకర్యానికి 1 కోటి 40 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. వేములవాడలో దసరా పండుగ సందర్భంగా మహాలక్ష్మి వీధిలో జమ్మి చెట్టు వరకు నడకకు ఇబ్బందులు లేకుండా 35 లక్షల రూపాయ లతో పనులు చేపట్టినట్లు వివరించారు. కుల,మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం రూ. 1.30 కోట్లు, బీసీ భవన్ రూ. – 1.30 కోట్లు, ఎస్టీ భవన్ రూ.– 1.30 కోట్లు, క్రిస్టియన్ భవన్ రూ. – 1.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వేములవాడ పట్టణంలో ముస్లింలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న షాదీ ఖానా అసంపూర్తి భవన నిర్మాణానికి 80 లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయిం చామని వెల్లడించారు. మురుగు నీరు గుడి చెరువులో, మూలవా గులో కలవకుండా నివారించే ందుకు 10 కోట్ల రూపాయలతో ప్రత్యేక మౌలిక వసతుల పనులు కొనసాగు తున్నామన్నారు. గంగమ్మ తల్లి దేవాలయానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గంగపుత్రులకు ఇచ్చిన హామీ మేరకు 80 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిం చామని తెలిపారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. వేములవాడ పరిధిలోని నాంపల్లి గుట్ట నుండి సంకేపల్లి వరకు పాత రోడ్డు ఉందని దానిని అభివృద్ధి చేయాలని, కోనాయపల్లి కాషాయపల్లి మధ్యలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని, బాలానగర్ షత్రాజ్ పల్లి మధ్యలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, రుద్రంగి భీమారం మండలాల్లో ఎంపీడీవో కార్యాలయం నిర్మాణం చేపట్టాలని మంత్రిని ప్రభుత్వ విప్ కోరారు.వీటీఏడీఏ వైస్ చైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గా శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధి పనుల్లో బాగస్వామి కావడం అదృష్టమని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. తిప్పాపూర్ జంక్షన్ వద్ద శివుడి థీమ్ తో అభివృద్ధి చేస్తామని వివరించారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటుగా బద్ది పోచమ్మ ఆలయం, గుడి చెరువు సుందరీకరణ, వేములవాడ మున్సిపల్ రోడ్ల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి పనులు చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆర్డీఓ రాధాబాయ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com